

హైదరాబాద్ వార్త

# దోమల హాట్‌స్పాట్‌లను గుర్తించి చర్యలు తీసుకోండి

* బస్తీలు, హాస్టళ్లు, ఖాళీ స్థలాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి
* షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్ల పరిశ్రుభ్రతపై నివేదిక ఇవ్వండి
* వివిధశాఖల అధికారులకు జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి ఆదేశం



జూబ్లీహిల్స్‌లోని పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ అమ్రపాలి,జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** నగరంలో దోమలు ఉత్పత్తి అయ్యే హాట్‌స్పాట్‌లను గుర్తించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం జోనల్ కమిషనర్‌లు, అడిషనల్ కమిషనర్ యుసిడి, హెల్త్, ఛీఫ్ ఎంటామాలజీ, కాల్ సెంటర్ ఎస్ఈ లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అమ్రపాలి మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నివారణలో భాగంగ పాఠశాల, కాలేజీల్లో చేపట్టే అవగాహన కార్యక్రమాలు వెంటనే పూర్తి చేసి, హాట్‌స్పాట్‌లపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా బస్తీలు, భవన నిర్మాణ స్థలాల వద్ద, వసతిగృహాల్లో, ఓపెన్‌స్థలాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్ నిర్దేశించిన ప్రకారంగా చెత్త సేకరణ, డైలీ హాజరైనవారికి సర్కిల్, జోనల్‌వారీగా గుర్తించి అవార్డు ప్రధానం చేయాలని శానిటేషన్ అడిషనల్ కమిషనర్‌ను ఆదేశించారు. అదేవిధంగా స్వచ్ఛ ఆటోల హాజరు పరిస్థితి సరిగా లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకోవాలని, ఈఎంఐ పూర్తి చేసిన స్వచ్ఛఆటో యజమాని సమక్రమంగా హాజరు కాకుండా, నిర్దేశించిన ప్రకారంగా చెత్తసేకరణ చేయని పక్షంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఈఎంఐ పూర్తి కానీ స్వచ్ఛఆటో చెత్తసేకరణలోగానీ, సక్రమంగా హాజరుకాని పక్షంలో ఆసక్తిఉన్న నిరుద్యోగి కేటాయింపు చేయాలని సూచించారు. యుద్ధ ప్రాతిపదికన జివిపిల తొలగింపు ప్రక్రియ వేగవతం చేయాలని స్వచ్ఛ ఆటోలో చెత్తవేయని కుటుంబాలను గుర్తించి ఆటోల్లో వేసేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. షాపింగ్ మాల్, సినిమా థియేటర్లలో టాయిలెట్‌లు పరిశుభ్రంగా ఉండే విధంగా ఫైర్‌సేఫ్టీ పరిశీలన చేసి సర్కిళ్ల వారీగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

**సివిల్ వర్క్స్‌టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలి...**

జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో చేపట్టిన వివిధ సివిల్ వర్క్స్ టెండర్ల ప్రక్రియను వేగవంతం పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి సంబంధిత అధి5కారులను ఆదేశించారు. గురువారం జూబ్లీహిల్స్ సర్కిల్‌లో కమిషనర్ పర్యటించి లోటస్‌పాండ్, పాత్‌వే, మంగోలియా బేకరీ వద్ద గల పార్కు, తదితరాలను పరిశీలించి ఆయా అధికారులకు పలు సూచనలు చేశారు. లోటస్‌పాండ్‌లోని సివరేజ్ కనెక్షన్లను తొలగించాలని, నాలాలల్లో స్ట్రామ్‌వాటర్, ఫ్లోటింగ్ మెటీరియల్ రాకుండా మెష్ ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. డ్యామేజ్ అయిన పాత్‌వేలకు వెంటనే రిపేర్లుచేయాలని సూచించారు. మంగోలియా బేకరీవద్ద నుంచి రోడ్‌నెంబర్ 44,45 వరకు రోడ్డు, సీవరేజిపనులు చేపట్టడానికి సంబంధించిన సివిల్ వర్క్స్ టెండర్ల ప్రక్రియను త్వరగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, ఈఈ విజయ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, వాటర్ వర్క్స్,స్పోర్ట్స్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# 'కరిచి కండ లాగేస్తున్నాయి'



◆వీధికుక్కల స్వైర విహారం
◆చిన్నారులు బలవుతున్న సంఘటనలు
◆ఫీవర్ హాస్పిటల్‌లో క్యూకడుతున్న బాధితులు
◆ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** వీధికుక్కల దాడులపై తెలంగాణ హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. కుక్క కాటు వల్ల సంభవించే చిన్నారుల వరుస మరణాలను ధర్మాసనం సీరియస్‌గా తీసుకుంది. ఈ ఘటనలపై చర్యలు ముమ్మరం చేయనందుకు తెలంగాణ సర్కారుకు ఆదేశాలు జారీ చేసింది. నగర రోడ్లపై వ్యర్థాలు అధికమవ్వడంతో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తూ దాడులకు పాల్పడుతున్నాయని, రహదారులపై పేరుకునే వ్యర్థాలను శుభ్రపరచాలని వ్యాఖ్యానించింది. శునకాల బారి నుంచి పసి పిల్లలను రక్షించేందుకు పరిష్కార మార్గాలను అన్వేషించాలని, వచ్చే వాయిదాకు సరైన పరిష్కార మార్గాలతో రావాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. వాదనలలో భాగంగా శునకాల నిర్మూలనలు ముమ్మరం చేస్తామని, అందుకోసం ఆరు రాష్ట్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఏజీ తెలిపారు. వీధికుక్కలకు స్టెరిలైజేషన్ చేసి వాటి సంతానోత్పత్తిని తగ్గించవచ్చని ఆయన అన్నారు. కాగా అది తాత్కాలికమేనని, జంతు సంక్షేమ కమిటీలతో సమన్వయం చేసుకుని పరిష్కార నిర్ణయం తీసుకోమని న్యాయస్థానం సూచిస్తూ, తదుపరి వాయిదాని వచ్చే వారానికి వేసింది. జవహర్‌నగర్‌కు చెందిన రెండేళ్ల బాలుడు విహాన్ వీధికుక్కల దాడిలో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ మరణించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో మాత్రమే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో కుక్కల దాడులకు తక్షణమే అవసరమైనమందులను అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. వీధికుక్కల దాడులు తగ్గుముఖం పట్టే విధంగా పశు వైద్యులు, బ్లూ క్రాస్ ప్రతినిధులతో కమిటీ వేయమని చెప్పారు.

**కుక్కల సంఖ్య స్థిరం, దాడులు అధికం**

వీధికుక్కలన్నీ కలిసి గుంపుగా తిరుగుతూ దారినపోయే బాటసారుల్ని, ఇంటి ముందు ఆడుకునే చిన్నారుల్ని, బైక్‌లపై సందుల్లో వేగంగా వెళ్లే వారినీ తరుముతూ దొరికినవారిని కరుస్తున్నాయి. వీటివల్ల ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురైన కొన్ని ఘటనలు, చిన్నపిల్లలు, బాటసారులపై శునక దాడులు తరచూ సంభవిస్తున్నాయి. ఈ క్రమంలో వల్ల ర్యాబిస్ వ్యాధి వచ్చి చనిపోయేవారి సంఖ్య పెరుగుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వీధికుక్కల నియంత్రణకు బల్దియా పశువైద్య విభాగం ఏటా రూ.10కోట్లు ఖర్చు చేస్తున్నా, కుక్కల దాడులు మాత్రం తగ్గనట్లు తెలుస్తోంది. నగరంలో కుక్కల సంఖ్యతో స్థిరంగా ఉన్నా కుక్క కాట్ల ఘటనల సంఖ్య మాత్రం రోజు రోజుకూ పెరుగుతున్నాయి. హైదరాబాదులోని ఒక్క ఫీవర్ హాస్పిటల్‌కే రోజుకి సగటున 80 నుంచి 100 మందికి పైగా పేషెంట్లు కుక్కకాటుకు గురై చికిత్సకు వస్తున్నట్లు వైద్యుల సమాచారం. గత పదేళ్లలో ఒక్క జిహెచ్‌ఎంసీ పరిధిలోనే 3,36,767 మంది ప్రజల కుక్కకాటు కేసులు నమోదవ్వగా, మూడేళ్ళ కాలంలో తెలంగాణలో ర్యాబిస్‌తో చనిపోయిన కేసులు 38 నమోదయినట్లు ఫీవర్ ఆసుపత్రి అధికారులు వెల్లడించారు. మరోపక్క నగర వ్యాప్తంగా 3లక్షలకు పైగా వీధి కుక్కలు ఉన్నాయని, వీటన్నిటినీ సంరక్షణా కేంద్రాలకు తరలించాలంటే కొంత సమయం పడుతుందని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా ఒక్క నగరంలో మాత్రమే కాకుండా నగర శివారు ప్రాంతాల్లో కూడా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. బోడుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని కేశవ నగర్, కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్దా, లక్ష్మి నగర్ కాలనీ ప్రాంతంలో, పీర్జాదిగూడా మున్సిపాలిటీ, దుండిగల్, నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోనూ, ఇతర శివారు ప్రాంతాల్లో వీధికుక్కల బెడద అధికమవుతున్నట్లు స్థానికుల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**ర్యాబిస్ సోకిన శునకాలు దాడి చేస్తే...**

ర్యాబిస్ వైరస్ సోకిన శునకాలు పిచ్చి పట్టినట్టుగా వ్యవహరిస్తాయని, క్రమంగా వాటి ఆరోగ్యం విషమించి చనిపోతాయని, ఈ క్రమంలో వాటికి ఎదురుపడిన వారిపై దాడిచేసి కరుస్తాయని ఫీవర్ ఆసుపత్రిలో అధికారులు హెచ్చరిస్తున్నారు. అవి సాధారణంగా చలికాలంలో సంపర్క సమయంలో కోపంగా ఉంటూ దాడికి పాల్పడతాయని, వేసవి కాలంలో కూడా అవి విపరీతంగా వ్యవహరించడానికి ఎండ వేడికి, ఆకలికి తట్టుకోలేకపోవడమే కారణమని చెప్పారు. కుక్క కాటుకు గురైనవారు నిర్లక్ష్యం చేసి ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని చెబుతున్నారు. కుక్కకాటుకు తగిన చికిత్స తీసుకోకపోతే నీరు, గాలి, శబ్దం వంటివాటిని పేషెంట్ భరించలేడని, గొంతులో షాక్ తగిలినట్లు గింజుకుని కుక్క లాగే మొరుగుతాడని తెలిపారు. ఈ వ్యాధిఉన్న రోగులుగానీ, కుక్కగానీ ఎక్కువ కాలం జీవించరని, సకాలంలో చికిత్స అందించడం వల్ల ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని చెప్పారు. కుక్క కరిస్తే వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతోపాటు, గాయమైనచోట డెట్టాల్ వేసిన నీటితో శుభ్రపరిచి సబ్బుతో కడగాలన్నారు. అనంతరం బెటాడిన్ లోషన్‌రాసి తక్షణమే సమీప ఆసుపత్రికి వెళ్లాలని, 24 గంటలలోపు తప్పనిసరిగా రిగ్(ర్యాబిస్ ఇమ్యూనో గ్లోబలిన్) వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. లోతైన గాయాలయ్యి రక్తస్రావం అవుతున్నట్లయితే చర్మం పూర్తిగా మందగిస్తుందని, అటువంటి సమయంలో వైద్యులు నాలుగు టీకాలతో పాటు యాంటీ ర్యాబిస్ సీరమ్ ఇంజెక్షన్ చేస్తారని తెలిపారు. ఈ చికిత్స చేయించుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని తెలియజేశారు.

# పాతబస్తీకి బోనాల పండుగ కళ

**నేటి నుండి లాల్‌దర్వాజ 116వ వార్షిక బోనాల ఉత్సవాలు, ప్రారంభించనున్న నగర పోలీస్ కమిషనర్,జిహెచ్‌ఎంసి కమిషనర్**



అమ్మవారి ఆలయం

**చాంద్రాయణగుట్ట, జూలై 18 ప్రభాతవార్త,** ఆషాడమాస బోనాల జాతర ఉత్సవాలు పాత నగరంలో అన్ని దేవాలయాల్లో శుక్రవారం కలశ స్థాపనతో ప్రారంభంకానున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభమయ్యే ఈ బోనాల ఉత్సవాలు 29వ తేదితో ముగుస్తాయి. ఉదయం పాత బస్తీలోని అన్నిదేవాలయాల్లో అమ్మవార్లకు అభిషేకం, పూజ కార్యక్రమాలు, కలశస్థాపన, శిఖర పూజతో ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమవుతాయి. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి భాగ్యనగర్ శ్రీ మహంకాళి బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

**22వ తేదీన సామూహిక ఘటాల ఊరేగింపు...**

బోనాల ఉత్సవాల్లో భాగంగా 22వ తేది ఆదివారం ఘట స్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమం కనుల పండువగా నిర్వహించడానికి ఊరేగింపు కమిటీ ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు జరిగే రోజునే సాయంత్రం పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమంలో శాలిబండాలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి ప్రారంభమై లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఊరేగింపు కమిటీఆధ్వర్యంలో ప్రముఖులు విచ్చేసి ఘటాలకు స్వాగతం పలుకుతారు. అనంతర ఆలయాల్లో ప్రతిష్టించి తొమ్మిది రోజుపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

**లాల్‌దర్వాజలో 116వ వార్షిక బోనాల ఉత్సవాలు....**

పాతనగరంలో అత్యంత వైభవంగా, భక్తిశ్రద్దలతో జరుపుకునే లాల్‌దర్వాజ శ్రీ సింహవాహిణి మహంకాళి ఆలయం 116వ వార్షిక ఆషాడమాస బోనాల జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉత్సవాలను పురష్కరించుకొని మొదటి ఆదివారం గోల్కొండలోని శ్రీ జగదాంబ అమ్మవారు, రెండవ ఆదివారం సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర, మూడవ ఆదివారం పాతనగరంలోని లాల్ దర్వాజ శ్రీ సింహవాహిణి మహంకాళి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, శిఖరపూజ, ధ్వజారోహణ, కలశ స్థాపనతో తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా భక్తిశ్రద్దలతో జరగనున్నాయి. బోనాల జాతరను పురష్కరించుకొని పాతనగరంలోని ప్రధానమైన అన్ని మహాంకాళీ అమ్మవారి దేవాలయాలను ఆలయాల కమిటీ ప్రతినిధులు విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. లాల్ దర్వాజ శ్రీసింహవాహిణి మహంకాళి దేవాలయం, ఉప్పుగూడ శ్రీమహాంకాళీ దేవాలయం, గౌలిపురా భారత మాత, కోట మైసమ్మ దేవాలయం, హరిబౌలి శ్రీఅక్కన్నమాదన్న మహాంకాళీ దేవాలయం, బేలా ముత్యాలమ్మ దేవాలయం, సుల్తాన్‌షాహిలోని శ్రీ జగదాంబ దేవాలయం, మీరాలం మండి శ్రీమాతేశ్వరీ దేవాలయంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న దేవాలయాల్లో బోనాల ఉత్సవాలు ప్రారంభ కానున్నాయి. 19వ తేదినుంచి ప్రారంభమయ్యే బోనాల ఉత్సవాలలో తొలి రోజైన శుక్రవారం ఉదయం లాల్‌దర్వాజ సింహవాహిణి శ్రీ మహంకాళి దేవాలయం 116వ బోనాల ఉత్సవాలలో భాగంగా ఉదయం సప్తశతి పారాయణం, ప్రవచనాలు అనంతరం ఉదయం 8 గంటలకు దేవి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం 10.45గంటలకు నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి విచ్చేసి దేవాలయం శిఖర పూజ, ధ్వజారోహణ గావించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారు.

ఈ ఉత్సవాలలో ఈ నెల 22వ తేదీన ఆదివారం సాయంత్ర శాలిబండ లోని కాశీవిశ్వనాథ దేవాలయం నుండి అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 28వ తేది అమ్మవారికి బోనాల సమర్పణ, ప్రముఖులచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, రా త్రి 8 గంటలకు అమ్మవారి శాంతి కళ్యాణం జరుగుతుంది. 29వ తేదిన సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం భవిష్యవాణి వినిపించే రంగం కార్యక్రమం తరువాత అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా ఢిల్లీ దర్వాజ వరకు తీసుకొని వెళ్ళడంతో ఉత్సవాలుముగుస్తాయి.

## 20,21 తేదీల్లో "కమ్మ గ్లోబల్ సమ్మిట్ "

**కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు జెట్టి కుసుమకుమార్**

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** ఈనెల 20,21 తేదీల్లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసిసి)లో తొలి 'కమ్మ గ్లోబల్ సమ్మిట్ 'ను నిర్వహించనున్నట్లు 'కమ్మ గ్లోబల్ సమ్మిట్ ' ను నిర్వహించనున్నట్లు కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జెట్టి కుసుమ కుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న కమ్మ సామాజిక వర్గ ప్రజలకోసం ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సుమారు 2వేలమందిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరవుతారని అలాగే పెట్టుబడుల కోసం నిర్వహించే సెషన్‌కు ఐటిమంత్రి శ్రీధర్‌బాబు హాజరవుతారన్నారు. అలాగే చివరిరోజు 21తేదీన రెండుతెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలో ఖమ్మసామాజిక వర్గం నుంచి గెలుపొందిన ప్రజాప్రతినిధులకు సన్మానం చేయనున్నామని దీనికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ముఖ్యఅతిధిగా హాజరుతారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఇ.సుబ్బారావు, ఎం.బానుప్రసాద్, వి.శ్రీనివాస్‌రావు, ఎం.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# ప్రజాపాలన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజా సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్,

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** ప్రజాపాలన ఆరుగ్యారంటీల్లో భాగంగా గృహ జ్యోతి, మహాలక్షీనమ పథకాలు రాని దరఖాస్తు దారుల డేటా సవరణకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని రాష్ట్ర రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. ఈసందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆరుగ్యారంటీలకు దరఖాస్తు చేసుకున్నా రాని వారు డేటా సవరణ కోసం ప్రజాపాలన సేవా కేంద్రాలకు వెళ్లి డేటా సవరణ చేసుకుని లబ్ధిపొందాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ,ప్రజా పాలన సేవా కేంద్రాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. డేటా సవరణ కోసంవెళ్లే దరఖాస్తు దారులు తమ వెంట రేషన్‌కార్డు , ఆధార్‌కార్డు, విద్యుత్ సర్వీస్ నెంబర్, గ్యాస్ కనెక్షన్ నెంబర్, ఎల్పీజి కష్టమర్ ఐడీ, మొబైల్ నెంబర్ తీసుకు వెళ్లాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ వెంకటాచారి, ఈడిఎం రజిత పాల్గొన్నారు.

# అగ్రస్థానానికి ఏకలవ్య బాథమ్

## -మాన్‌సూన్ రెగట్టా పోటీలు



**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** హుస్సేన్‌సాగర్ వేదికగా 15వ మాన్‌సూన్ రెగట్టా పోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. నాలుగోరోజు గురువారం అన్ని విభాగాలల్లో రెండేసి రౌండ్లు రేసులు నిర్వహించారు. ఐఎల్‌సిఏ4 బాలుర విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఏకలవ్య బాతం కొన్ని అద్భుతమైన ఫినిషింగ్‌లతో ఫ్లీట్‌లో అగ్రస్థానానికి చేరుకున్నారు. టిఎన్‌సి మైసూర్‌కు చెందిన కృష్ణ దివాకర్ 3వ స్థానానికి , మధ్యప్రదేశ్‌కు చెందిన అక్షత్ దోహ్రేను రెండోస్థానానికి నెట్టేశాడు. మరోవైపు అండర్ 16 ఆప్టిమిస్ట్ ఫ్లీట్ విభాగంలో తెలంగాణ కుర్రాడు గోవర్ధన్ పల్లార తన అగ్రస్థానాన్ని కొనసాగించాడు. 8,9 రౌండ్ రేసుల్లో 5,6వ స్థానాల్లో నిలిచిన గోవర్ధన్ స్వర్ణపతకం దిశగా ముందుకెళ్తున్నాడు. అయితే ఎస్‌హెచ్ బాబు ట్రోఫీని కైవసం చేసుకోవడానికి మిగిలిన రెండు రేసుల్లో అతను నిలకడ చూపాల్సి ఉంది. తెలంగాణకే చెందిన దీక్షిత 9వ రేసులో 14వ స్థానం నుంచి దూసుకొచ్చి విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఓవరాల్‌గా రెండోస్థానానికి చేరుకుని గోవర్ధన్‌కు గట్టి పోటీ ఇస్తుంది. అండర్ 18 అంతర్జాతీయ 420 మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలంగాణ జోడీలు వైష్ణవి వీరవంశం-శ్రవణ్ కత్రావత్, తనుజా కామేశ్వర్ -గణేష్ పీర్కట్ల తొలి రెండు స్థానాలను నిలబెట్టుకున్నారు.

# 20న గోపన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభం

**ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి... పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి**



గోపన్‌పల్లి ఫైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

**గచ్చిబౌలి, జూలై 18 ప్రభాతవార్త** ఐటి కారిడార్‌ను అనుసంధానం చేస్తూ ఉన్న రహదారుల మీద ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన గోపన్‌పల్లి ఫ్లైఓవర్‌ను ఈనెల 20వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గోపన్‌పల్లి తండా చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన గోపన్‌పల్లి ఫ్లైఓవర్ వన్‌వే నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఐటి కారిడార్ గౌలిదొడ్డి నుంచి తెల్లాపూర్, నల్లగండ్ల వైపు వై ఆకారంలో ఈ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారు. మొత్తం 28.5 కోట్ల రూపాయల వ్యయంతో నల్లగండ్ల వైపు 430 మీటర్ల పొడవు, తెల్లాపూర్ వైపు 550 మీటర్ల పొడవుతో వన్‌వే తరహాలో ఈ ఫ్లైఓవర్ నిర్మించారు. ఈనెల 20వ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగనుండగా, తుదిదశ పనులు, సుందరీకరణ పనులను గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన పనులు, ప్రారంభోత్సవం కోసం తీసుకోవాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఫ్లైఓవర్ కిందఉన్న రహదారిపై బిటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఐటి కారిడార్‌కు అనుసంధానంగా ఉన్న రహదారులను మొత్తం ఆధునీకరిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కొండాపూర్ రహదారి, హెచ్‌సియు రహదారులు తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుండడంతో, గోపన్‌పల్లి రహదారిని విస్తరించినట్లు తెలిపారు. గోపన్‌పల్లి రహదారిలో అతి కీలకమైన తాండ చౌరస్తా వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుండడంతో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ గోపన్‌పల్లి ఫ్లైఓవర్ నిర్మాణంతో స్థానిక ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా పడుతున్న ట్రాఫిక్ కష్టాలకు మోక్షం కలుగుతుందన్నారు. ఐటి కారిడార్ నుంచి తెల్లాపూర్, నల్లగండ్ల వైపు ప్రయాణించే వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిందని, కీలకమైన గోపన్‌పల్లి చౌరస్తావద్ద ట్రాఫిక్ రద్దీతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి డిప్యూటీ కమీషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి, జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# శ్రీఉజ్జయినీ మహాకాళీ బోనాలకు పటిష్టమైన ఏర్పాట్లు



బోనాల ఏర్పాట్ల గురించి సీఐ పరుశురాంతో చర్చిస్తున్న దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు

**బేగంపేట జూలై 18, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయం వద్ద ఈనెల 21,22న జరగనున్న ఆషాడ బోనాల జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ కమిషనర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. గురువారం శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి, మహంకాళీ ఇన్స్‌పెక్టర్ తదితర అధికారులతో చేపడుతున్న ఏర్పాట్లపై ఆయన ఆరా తీసారు. భక్తులకు క్యూలైన్లలో గానీ ఆలయానికి చేరుకున్నాక, అమ్మ వారి దర్శనం విషయంలో గానీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా దర్శనం చేసుకుని వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని అధికార్లకు సూచించారు. గతంలో ఎన్ని క్యూలైన్ల ఏర్పాటు చేసారు. ఈ ఏడాది క్యూలైన్లు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు. బోనాల లైన్‌తోపాటు ఆలయానికి వచ్చే శివ సత్తులు, బోనం ఎత్తుకుని వచ్చే మహిళలకు ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. కమిషనర్ వెంట రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, సికింద్రాబాద్ జిల్లా అసిస్టెంట్ కమీషనర్ సంధ్యారాణి, హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, మహంకాళీ ఇన్స్‌పెక్టర్ పరుశురాం ఉన్నారు.

## దేశంలో సంతానోత్పత్తి సమస్యలను ఎదుర్కొంటున్న 28 మిలియన్ల జంటలు

**సైఫాబాద్, జూలై 18 (ప్రభాతవార్త):** సంతాన లేమి పట్ల ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని ఫెర్టీ9 ఫెర్టిలిటి సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి సి.బుడి అన్నారు. హైదరాబాద్ ఫెర్టీ9 ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె టు గెథెర్ ఇన్ ఐవీఎఫ్-2024 ప్రచారంలోగోను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో 28 మిలియన్ల జంటలు సంతానోత్పత్తి సమస్యలను ఎదుర్కొంటున్నారని, నిశ్చల జీవనశైలి, పెరుగుతున్న వత్తిడి స్థాయిలు, ఊబకాయం, ఇతర వైద్య పరిస్థితుల కారణాల ఈ సంఖ్య పెరుగుతున్నదని ఆమె విచారం వ్యక్తం చేశారు. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ఫెర్టీ9 ప్రత్యేక అవగాహన ప్రచారాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ అవగాహన ప్రచారం, లక్ష్యాలు, వంధ్యత్వం, ఐవీఎఫ్ చికిత్సలు గుర్తించడంలో ప్రాముఖ్యత కలిగి ఉన్నదని ఆమె వివరించారు. వీధి నాటకాలు, ఇతర కార్యకలాపాల ద్వారా వంధ్యత్వం ఐవీఎఫ్ చికిత్సలగురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమాన్ని ఇక్కడ ప్రారంభించడం జరిగిందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో వంధ్యత్వంతో బాధపడుతున్న వారికి మ్యూజిక్ ఆఫ్ హోప్ పేరుతో ఫెర్టీ9ను పరిచయం చేస్తున్నామని జ్యోతి తెలిపారు. టు గెథెర్ ఇన్ ఐవీఎఫ్ ప్రచారం తెలుగు రాష్ట్రాల అంతట వీధి నాటకాల ద్వారా సంతానలేమి, ఐవీఎఫ్ చికత్సల గురించి అవగాహన పెంచడానికి ఒక కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

## పిల్లలను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్చాలి : రేణుకరెడ్డి



అంబేద్కర్ నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడి చిన్నారులు

**కంటోన్మెంట్, జూలై 18 (ప్రభాతవార్త):** 5 సంవత్సరాలలోపు చిన్న పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడి కేంద్రంలో చేర్చాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రేణుక రెడ్డి తెలిపారు. గురువారం రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో అమ్మమాట అంగన్‌వాడి బాట నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. రెండున్నర సంవత్సరాల వయసు ఉన్న పిల్లలను తప్పనిసరిగా అంగన్ వాడి కేంద్రాల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు కె.రేణుక, కల్పనలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిత : కార్పొరేటర్

**వివేకానందనగర్ కాలనీ, జూలై 18, (ప్రభాతవార్త) :** రేపటి పౌరుల బంగారు భవితను అందించే మహత్తర శక్తి ఉపాధ్యాయులకే ఉందని వివేకానందనగర్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అన్నారు. గురువారం వివేకానందనగర్ కాలనీ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీలోని మండల ప్రాథమిక పాఠశాలలో జరిగినటువంటి ఉపాధ్యాయుల బదిలీ కార్యక్రమంలో కార్పొరేటర్ రోజాదేవి పాలొనగని వారిని సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా నరపధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని అదేవిధంగా నూతనంగా నియమితులైనటువంటి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాలలో నెలకొన్న సమస్యలు తెలిపితే పాఠశాల అభివృద్ధికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన సమస్యల పరిష్కారం అయ్యేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి విద్యార్థి ఉన్నతమైన చదువులు చదివి ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన బి.జయరాజు, ఉపాధ్యాయరులు జి.ఆంజనేయులు, పి.విజయ కుమారి, ఏ.సునీత, ముకుందరెడ్డి, పీఎస్ సబిత, సృజన, నూతన ప్రధా నోపాధ్యాయులు ఇందిరా, ఉపాధ్యాయురాలు సంధ్యారాణి, చంద్రారాణి, పాల్గొన్నారు.

## బోనాల జాతరకు రావాలంటూ ఎంపి లక్ష్మణ్‌కు ఆహ్వానం



ఆషాడబోనాలకురావాలంటూ లక్ష్మణ్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఈఓ

**బేగంపేట జూలై 18,(ప్రభాతవార్త) :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాల జాతరకు విచ్చేయాలంటూ గురువారం ఆలయ కార్యనిర్వహణాధికారి, ఆలయ అర్చకులు, రాంగోపాల్‌పేట బీజేపీ నాయకులు ఎంపీ లక్ష్మణ్‌కు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయాల ప్రకారం ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చీరె శ్రీకాంత్, నరేంద్రపాల్, సందీప్ఏనుగుల, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.
ఫైల్‌నేమ్ .....18బేగంపేట జనరల్ 1

## శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో చండీహోమం....



మహాకాళీ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

**బేగంపేట, జూలై 18, (ప్రభాతవార్త) :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతరలో భాగంగా గురువారం ఆలయంలో వేద పండితులు వేణుమాధవశర్మ, ప్రధానార్చకులు రామతీర్ధశర్మల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చండీహోమం నిర్వహించారు. హోమం కార్యక్రమాన్ని భక్తి శ్రద్దలతో నిర్వహించగా జంట నగరాలకు చెందిన వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ ఓ ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేసారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేసారు.

## సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

**చిక్కడపల్లి, జూలై 18 (ప్రభాతవార్త):** బాగ్‌లింగంపల్లిలోని శ్రీ షిరిడిసాయి బాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను వైభవోపేతంగా నిర్వహించబోతున్నట్లు ఆలయం వ్యవస్థాపర వైస్‌చైర్మన్ పెదోళ్ళ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ధర్మరాజుగౌడ్ వివరించారు. జూలై 21న ఉదయం ఐదున్నర గంటలకు కాకడ హారతి కార్యక్రమంలో గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమవుతాయని, అనంతరం ఆరు గంటలకు చందనోత్సవం, అభిషేకం, తొమ్మిది గంటలకు సామూహిక సాయి వ్రతాలు, పన్నెండు గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని, రాత్రి పల్లకీసేవ, అనంతరం సాయి భజన ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## 'శ్రీమద్భాగవతం'పై గరికిపాటి నరసింహారావు ప్రవచనాలు'

**చిక్కడపల్లి, జూలై 18 (ప్రభాతవార్త):**
హైదరాబాద్ నగరంలో మహాసహస్రావధాని, పద్మశ్రీ అవార్డుగ్రహీత డాక్టర్ గరికిపాటి నరసింహారావుచే 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు 'శ్రీమద్భాగవత ప్రవచనాలు' డిడి కాలనీలోని అహోబిలమఠంలో నిర్వహించబోతున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆనంద్‌గ్రూప్‌ల ధార్మిక కార్యక్రమంలో భాగంగా 19న 'కేచేలోపాఖ్యానము', 20న 'రుక్మిణీ కళ్యాణం, 21న రుక్మిణి కళ్యాణ ఘట్టం అంశాలపై ప్రసంగిస్తారని వెల్లడించారు

# సాంస్కృతిక సంస్థలతో ప్రత్యేక సమావేశం

### రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న తెలంగాణ కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి ఆమని

**చిక్కడపల్లి, జూలై 18 (ప్రభాతవార్త):**
త్వరలో రాష్ట్రంలోని అన్ని సాంస్కృతిక సంస్థలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సంబంధిత శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. తెలంగాణ కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ వార్షికోత్సవ సభ బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వాహక సంస్థ నిర్వాహకులు, ప్రముఖ గాయనీ ఆమనీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ పక్షాన ప్రతినిధి, గాయనీ ఆమనితోకలిసి వివిధ సాంస్కృతికసంస్థల ప్రతినిధులు మంత్రికి వినతిపత్రాన్ని అందించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సాంస్కృతిక సంస్థలపై ఉందని, వారి సహకారాన్నితీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో శృతిలయ ఆర్ట్స్ చైర్మన్ డాక్టర్ బి.భీమ్‌రెడ్డి, రసమయి సంస్థ అధినేత డాక్టర్ ఎం.కె.రాము, పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త, డాక్టర్ కుసుమ భోగరాజు, లోకం కృష్ణ, త్యాగరాజు, మల్లెల వసుంధర, టిఎస్జీఓస్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.జగదీశ్వర్, డాక్టర్ ఎం.ముజీబ్ అసోసియేట్ ప్రెసిడెంట్ సత్యనారాయణ గౌడ్, ఏలూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. తొలుత 'దాశరథి-డాక్టర్ సినారె' సినీసంగీత విభావరి కార్యక్రమం ప్రముఖ ఆమనీ గాయనీ సారథ్యంలో గాయనీ గాయకులు సుభాష్, రాజన్, వెంకటేశ్వరరావు, పద్మశ్రీ, నవిత, గాయత్రి తదితరులు అద్భుతంగా గానం చేశారు. కార్యక్రమానికి వ్యాఖ్యాత పిఎంకె.గాంధీ వ్యవహరించారు.

# కొని చదివితేనే పుస్తకం సాహిత్యానికి విలువ



వైభవం-2 కవితా సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అరుంధతి రంగాచార్యులు తదితరులు

**రవీంద్రభారతి, జూలై 18 (ప్రభాతవార్త) :**
పుస్తకావిష్కరణ సభల్లో ప్రేక్షకులందరూ ఉచితంగా పుస్తకాన్ని అందుకోవడంకంటే డబ్బులుపెట్టి కొని చదివితేనే ఆ పుస్తకానికి, రచనలకి, సాహిత్యానికి విలువ, రచయితకు ఆనందంతో ముందుకు తీసుకు వెళ్లగలుగుతామని శ్రీవిజయలక్ష్మీ దేవాలయం ప్రధానార్చకులు గట్టు అరుంధతి రంగాచార్యులు అన్నారు. సాహిత్య కార్యక్రమాలు విరివిగా జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు తగిన సహాయం చేస్తానని భరోసానిస్తూ ఇదే మనం కవులకు రచయితలకు ఇచ్చే ఊపిరి ప్రోత్సాహమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండులక్షల ఋణమాఫీ జీఓను తెలుగులో ఇచ్చినందుకు తెలుగుభాషా చైతన్యసమితి అధ్యక్షుడు పి.బడేసాబ్ తెలుగు సంఘాలన్నింటి తరపున హర్షం ధన్యవాదాలు తెలుపుతూ ఇకనుండి వచ్చే అన్ని ప్రభుత్వ జీఓలు తెలుగులోనే వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో గీతా ఫౌండేషన్, లక్ష్య సాధన ఫౌండేషన్, నక్క వెంకటమ్మ యాదవ్, యాదగిరి స్వామి ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖకవి రామకృష్ణ చంద్రమౌళి సభాధ్యక్షతన జరిగిన పుస్తకాల ఆవిష్కరణసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రంగాచార్యులు మరో ముఖ్యఅతిథి తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎస్.బాలాచారి, విశిష్ట అతిథులు పి.బడేసాబ్, యుగంధర్‌గౌడ్, గంటా మనోహర్‌రెడ్డి, దైవజ్ఞశర్మ, ప్రజ్ఞారాజు, యుగేందర్ తదితరులతో కలిసి యాదాద్రి వైభవం, మరోరెండు కవితా సంపుటాలను ఆవిష్కరించి రచయితలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నలుగురికి ఆదర్శ దంపతుల పురస్కారాలు అందజేశారు. సభకుముందు జరిగిన కవిసమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది.

## సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన

### ఎబివిపి జిల్లా కన్వీనర్ బాలకృష్ణ

**బేగంపేట జూలై 18,(ప్రభాతవార్త) :** సికింద్రాబాద్ పీ.జీ కాలేజీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం నిరసన వ్యక్తం చేసారు. గ్రౌండ్, కాలేజీ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, దోమల నివారణకు కృషి చేయాలని, సెల్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజేషన్ చేయాలని, శిధిలావస్థలో ఉన్న తరగతి గదులను పునరుద్దరించాలని, జిమ్‌లో అన్ని వసతులు కల్పించాలని, విద్యార్థులకు 24 గంటలపాటు వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిల విడుదలకు తీసుకున్న చర్యలను తెలియజేయాలని, ప్రతినెల మెస్ బిల్లులను నోటీస్ బోర్డులో పెట్లాలని అదిక బిల్లుల పై చర్యలు తీసుకోవాలని పూర్తి సౌకర్యాలతో కూడిన కాలేజ్ క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని, పూర్తి సౌకర్యాలతో కూడిన స్టడీ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు పీజీ కాలేజీ వద్ద నిరసన వ్యక్తం చేసారు. ఈ విషయం తెల్సుకున్న బేగంపేట పోలీసులు ఇన్స్‌పెక్టర్ రామయ్య నేతృత్వంలో అక్కడికి చేరుకుని విధ్యార్థులతో చర్చించి వారి సమస్యను ప్రిన్సిపాల్ రవికుమార్ జాస్తికి వివరించారు. ఈ సందర్భంగా రవికుమార్ జాస్తి మాట్లాడుతూ వారం రోజుల్లో విధ్యార్థులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేసారు. అయితే విధ్యార్థులు మాత్రం వారం రోజుల తర్వాత సమస్యలు పరిష్కారం కాకపోయినట్లైతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందో ళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలేజ్ ఇంచార్జి పండురంగ్, రమేష్, సాయిరాం, సంతోష్, మౌనిక, స్వప్న, నీరజ, మనీష, వసంత, మల్లేష్, పవన్, ప్రణయ్, హరీష్, మహేష్, అభి, వినోద్, సాయి పాల్గొన్నారు.

## యువత రాజకీయాలలోకి రావాలి

### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా

**ముషీరాబాద్, జూలై 18, (ప్రభాతవార్త):** యువత పెద్ద ఎత్తున రాజకీయాలలోకి రావాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా పిలుపునిచ్చారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన సామాజిక కార్యకర్త గడ్డం శ్రీధర్ అనుచరులతో కలసి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా సాయిబాబా వారికి టీడీపీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ అభివృద్ధికి, ప్రగతికి సూచిక అయిన చంద్రబాబు నాయుడు చేస్తున్న సంక్షేమ కార్యక్రమా లకు ఆకర్షితులై యువత టీడీపీ వైపు చూస్తున్నారని తెలిపారు. గడ్డం శ్రీధర్ మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల ప్రయోజనాలు కాపాడాలని తాను టీడీపీలో చేరుతున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, గండికోట విజయ్, జి.ప్రవీణ్, విజయ్, వినోద్, ఎం.రాజు, మేడిపల్లి శ్యాం, భానుప్రకాష్, ఎన్.శ్రీనివాస్, రామారావు పాల్గొన్నారు.

### రోడ్ల మరమ్మతులు చేపట్టాలి : మేకల సారంగపాని

కంటోన్మెంట్, జూలై 18 (ప్రభాతవార్త): బోనాల పండుగ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బదులు కలుగకుండా రోడ్లను, అమ్మవారి దేవాలయాల వద్ద మరమ్మత్తులు చేపట్టాలని బిజెపి మహంకాలి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని ఆధ్వర్యంలో జిహెచ్‌ఎంసి సికింద్రాబాద్ సర్కిల్ డిసి సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. బోనాల ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని నీటి సౌకర్యం, దేవాలయాల చుట్టూ గుంతలు లేకుండా మరమ్మత్తులు చేపట్టాలని, ప్రతి దేవాలయం వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సి.హెచ్.కన్నాభిరామ్, కృష్ణమూర్తి, మహిళా మోర్చా అధ్యక్షురాలు అనీత, రాము వర్మ, హన్మంత్, వేణు పాల్గొన్నారు.

## బస్తీ నాయకులను ఎమ్మెల్యే అవమానించడం సరైంది కాదు

**కంటోన్మెంట్, జూలై 18 (ప్రభాతవార్త):** తమ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను విన్నవించుకోవడానికి వెళితే ఎన్నికల్లో తన గెలుపుకు సహకరించలేదని చిదరించుకోవడం సరైంది కాదని కంటోన్మెంట్ 5వ వార్డు ఖాకగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఖాకగూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అధ్యక్షుడు బాలక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి కె.బిక్షపతి, అడ్వైజర్ అశోక్ కుమార్‌లు మాట్లాడుతూ ఖాకగూడలో వేసిన రెండు పవర్ బోర్ వెల్స్‌కు మోటర్లు బిగించాలని, తమ బస్తీకి చెందిన రెండు గుళ్లకు అందజేసిన చెక్కుల్లో తప్పుడు దోర్లయి, వాటిని సరి చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ఖాకగూడ బస్తీ పెద్దలు విన్నవించుకోగా ఉప ఎన్నికల్లో తన విజయానికి సహకరించలేదు చిదరించుకున్నట్లు తెలిపారు. మీ బస్తీ వారు బోర్డు మెంబర్ రామక్రిష్ణకు నౌకర్లుగా పనిచేసేస్తున్నారని అనడం సరైంది కాదన్నారు. బోర్డు మెంబర్ రామక్రిష్ణ, ఎమ్మెల్యే శ్రీగణేష్‌ల మధ్య ఏమైనా రాజకీయాలు ఉంటే వారు తేల్చుకోవాలని ఆర్.కె.ను దృష్టిలో పెట్టుకొని తమను అవమానపర్చడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు గణేష్, శివకుమార్, అరవింద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు శుభాకాంక్షల వెల్లువ

**నార్సింగి, జూలై 17 (ప్రభాతవార్త) :** తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. గురువారం రాజేంద్రనగర్, చేవెళ్ల, వికారాబాద్, షాద్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఇంటికి వచ్చి, పుష్పగుచ్చాలు, పూల దండలు, షాలువాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. పీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి తన అనుచర గణంతో జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను ఘనంగా సన్మానించి, ముదిరాజ్ కులస్థుల సంక్షేమానికి పెద్దపీఠ వేయాలని కోరారు. అలాగే మెదక్ కాంటెస్టెడ్ ఎంపి నీలం మధు ముదిరాజ్, షాదనగర్ కాంటెస్టెడ్ అభ్యర్థి బాబయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గండయ్య ముదిరాజ్, క్యాతం అశోక్ యాదవ్, వినోద్, రాము, వేణుగౌడ్, కిరణ్, బండ్లగూడ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనాథ్‌రెడ్డి, అనితా వెంకటేష్, అస్లాం, నాయకులు ప్రేమ్ గౌడ్, నవీన్, హరికృష్ణ, నరేందర్, గణేష్, శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, కౌన్సిలర్లు శివారెడ్డి, దుర్గేష్ యాదవ్, అమరేందర్‌రెడ్డి, నాయకులు ఓంప్రకాశ్‌రెడ్డి, హరిశంకర్, యాదగిరి, వెంకటేష్, లక్ష్మణ్, తదితరులు జ్ఞానేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ముషీరాబాద్, జూలై 18, (ప్రభాతవార్త):** అనారోగ్యంతో గాంధీహాస్పటల్‌లో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గాంధీనగర్ సీఐ డి.రాజు తెలిపిన వివరాల ప్రకారం న్యూబోయిగూడలో నివసించే ఆకుల ప్రశాంత్‌కుమార్(52) వివాహం చేసుకోకుండా ఒంటరిగా ఉండేవాడు. గత కొంత కాలంగా మద్యానికి, సిగరెట్లకు బానిసైన ప్రశాంత్ ఆరోగ్యం క్షీణించింది. ఈ క్రమంలో ఈనెల 14వ తేదీ ప్రశాంత్ అన్న కూతురు శరీన్ షాలు బాబాయ్ ఇంటికి వచ్చింది. ప్రశాంత్ అప్పటికే క్రింద పడి ఆపస్మారక స్థితిలో ఉన్నాడు. స్థానికులు సాయంతో ప్రశాంత్‌ను గాంధీ హాస్పటల్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి, ప్రశాంత్‌కు పక్షవాతం వచ్చిందని తెలిపారు. గాంధీహాస్పటల్‌లో చికిత్స పొందుతున్న గురువారం సాయంత్రం మృతి చెందాడు. ప్రశాంత్ అన్న ఆకుల అరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని సీఐ తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణ 371 డి ద్వారానే సాధ్యం




మాట్లాడుతున్న గాలి వినోద్‌కుమార్, బ్రహ్మయ్యమాదిగ

**సైఫాబాద్, జూలై 18 (ప్రభాతవార్త):**
ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ 371 డి ద్వారానే సాధ్యమవుతుందని, బిజెపికి లోక్‌సభలో 400సీట్లు వచ్చిన సాధ్యం కాదని దక్షిణ భారత రాజకీయ జెఏసి ఛైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఎంఆర్‌పిఎస్ నాయకుడు మంద కృష్ణమాదిగ గత 30 సంవత్సరాలుగా వర్గీకరణ పేరు మీద తెలుగు రాష్ట్రాలలో రెండు కోట్ల మంది మాదిగలకు ద్రోహం చేస్తున్నారని, రాజకీయ నాయకులను తన స్వార్థ కోసం ఉపయోగించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ కమిటి ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. 371 డి ద్వారా వర్గీకరణ సాధ్యమని ఏపి సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రకటించారని, ఈ విషయాన్ని తాము స్వాగతిస్తున్నామని, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు 371 డి విషయంపై ప్రధాన మంత్రికి లేఖలు రాయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ గత మూడు దశాబ్ధాలుగా వర్గీకరణ సాధ్యం కాకపోవడంతో మాదిగలు అన్ని రంగాలలో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో నూతన ప్రజాస్వామిక ఎంఆర్‌పిఎస్ నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఒక వ్యక్తి తన స్వార్థం కోసం వర్గీకరణ అంశాన్ని వాడుకుని మాదిగలకు అన్యాయం చేశారని ఆయన ధ్వజమెత్తారు. కేంద్రంలోని బిజెపి గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉండి వర్గీకరణ చేయకుండా అణిచివేసిందని విమర్శించారు. కొంత మంది మనువాద అంబేద్కర్ పేరుతో బిజెపికి మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ సాధనే ఏకైక లక్ష్యంగా మాదిగలు ఉద్యమించాలని, త్వరలో ప్రణాళిక రూపొందిస్తామని ఆయన తెలిపారు. అఖిల భారత ముస్లిం పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ఇస్లాముద్దీన్ మాట్లాడుతూ వర్గీకరణకు తమ సమితి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఈ సదస్సులో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఒదేలు మాదిగ, విజయ్‌మాదిగ, రాజుమాదిగ, బీంలింగం

## రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

**సైఫాబాద్, జూలై 18 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలో విద్య సంక్షోభంలో ఉందని, ఈ సంక్షోభం నుంచి బయటపడాలంటే వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. విద్య హక్కు చట్టం అమలులోకి వచ్చి 15 సంవత్సరాలు గడిచినప్పటికి అత్యధిక పాఠశాలల్లో కనీస వసతులు లేవని, విద్య హక్కు చట్ట ప్రకారం స్కూల్స్‌లో అమలు చేయడానికి తగినన్ని నిధులు కేటాయించాలని ఆ సంఘాల ప్రతినిధులు కోరారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘాల ప్రతినిధులు వేణుగోపాల్, జి.భాగ్యలక్ష్మి, రమణ, నరేందర్, రాధ తదితరులు మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాల నమూనాగా ఉన్నత పాఠశాలలను తీర్చి దిద్దాలని, విద్యా సామర్థ్యం వెనుక ఉన్న విద్యార్థులకు తగు విద్యా సామాగ్రిని అందించాలని, స్కూల్స్‌పై పర్యవేక్షణకు కావాల్సిన సిబ్బందికి నిధులు కేటాయించాలని, ప్రతి పాఠశాలలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు స్కావెంజర్లు, కాపలాదారులు, అటెండర్లను నియమించాలని, బడ్జెట్‌లో ఈ విషయాన్ని పరిగణంలోకి తీసుకోవాలని, గ్రామీణ విద్యార్థులకు ప్రజా రవాణా సదుపాయం లేక బడులు మానివేస్తున్నారని, విద్యార్థులకు ప్రజారవాణా సౌకర్యం కల్పించాలని లేనిపక్షంలో రవాణా పారితోషకం అందించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని, కేజీబీవీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందిని వీరిని పర్మినెంట్ చేయాలని, బాలికలకు మౌలికవసతులతోపాటు, నివాసయోగ్యమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, అన్నిశాఖలలోఉన్న 850 గురుకులాలలో, 1523 సంక్షేమ హాస్టళ్ళు ఉన్నాయని, ఈ గురుకులాలు హాస్టళ్ళు చాలా దయనీయ స్థితిలో ఉన్నాయని, యుద్ధ ప్రాతిపదికన ఈ గురుకులాల భవనాల్లో మౌలిక వసతులు కల్పించాలని, పిల్లలకు కల్పించిన రాజ్యాంగం కల్పించిన హక్కునున గ్యారంటి ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని వారు గుర్తు చేశారు.

## ప్రజలకు అండగా నిలబడతా

### - మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

**నార్సింగి, జూలై 18 (ప్రభాతవార్త) :** ఎన్నికలలో విలువైన ఓట్లు వేసి ఆశీర్వదించిన ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలబడుతానని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం మహేందర్‌గౌడ్ తన 22.వ,వార్డు పరిధిలోని పలు కాలనీల్లో పాడైపోయిన వీధి దీపాలకు మరమ్మతులు, కొత్త లైట్లు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి పైప్‌లైన్, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు, అంతర్గత రోడ్లు, పార్కులు, స్మశాన వాటికలు ఇలా అన్ని అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల్లో డివిజన్ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని పూర్తి చేశానని తెలిపారు. అక్కడక్కడ ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే నా దృష్టికి తీసుకు రావాలని, వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని వివరించారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి ఇబ్బందులు తెలుసుకొని వెను వెంటనే పరిష్కారం చూపుతున్నామన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నాయకత్వంలో ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నామని మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ స్పష్టం చేశారు.

## యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు సినారె పురస్కార ప్రదానం

**నాంపల్లి, జూలై 18 (ప్రభాతవార్త):** మహాకవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా. సి.నారాయణరెడ్డి 93వ జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకొని రసమయి సంస్థ ఆధ్వర్యంలో పద్మభూషణ్ డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు డా. సినారె పురస్కారం ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. ఎం.కె.రాము తెలిపారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఈ నెల 22 సోమవారం రాత్రి 6గంటల నుండి డా. సముద్రాల వేణుగోపాలాచారి సభాధ్యక్షతన జరిగే ఈ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాల యం పూర్వ ఉపాధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పద్మశ్రీ ఖచార్య కొలకలూరి ఇనాక్, విశిష్ట అతిథిగా విశ్రాంత ఐఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి, నిర్వహకురాలిగా ఎం.కె.ఆర్.ఆశాలత తదితరులు పాల్గొని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను ఘనంగా సన్మానించి డా. సినారె పురస్కారం ప్రదానం చేస్తారని ఎం.కె.రాము వివరించారు. సభకుముందు ప్రముఖ వర్ధమాన గాయకులచే డా. సినారె ప్రజాదరణ పొందిన గీతాల సుమధురగానం ఉంటుందని పేర్కొన్నారు.

## సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

**సరూర్‌నగర్, జూలై 18 (ప్రభాతవార్త):** హైదరాబాద్ నగర శివార్లలోని మహేశ్వరం నియోజకవర్గంలో సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు నియోజకవర్గ రైతుల తరపున కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాలాభిషేకం చేశారు. ఎన్నికల హామీ మేరకు రైతు రుణమాఫీచేసి ప్రక్రియను ప్రారంభించిన సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ గ్రామంలో అదే విధంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్ చౌరస్తాలో సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలను పాలతో అభిషేకించారు. కార్యక్రమాల్లో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస ్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిసిసిబి మాజీ ఛైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కందాడి శ్రీరాంరెడ్డి, సిద్దాల దశరథ, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం సురక్షితం : బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 18, (ప్రభాతవార్త) :** రైతు సుభిక్షంగా ఉంటేనే గ్రామం, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుందని తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్రంలో రైతు రుణమాఫీ ప్రకటించిన నేపథ్యంలో బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులతో కలిసి రమేష్ పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఇచ్చినమాట మేరకు రైతు రుణమాఫిని గడువులోపలె అమలు చేస్తున్నందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శం అన్నారు. ఇలాంటి పథకాన్ని దేశమంతా అమలుచేసి రైతు రాజ్యం కోసం కృషి చేయాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందన్నారు. ఈ కారన్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగిరెడ్డి, తూము వేణు, పుష్పరెడ్డి, లక్ష్మయ్య, దినేష్ కుమార్, శ్రీకాంత్, శివకుమార్, చున్నుపాషా, కుక్కల రమేష్, మధుగౌడ్, అస్లాం, వరహాల స్వామి, రేష్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణపై అవగాహన సదస్సు..

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 18, (ప్రభాతవార్త) :** దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై యుసిడి, ప్రాజెక్ట్ అధికారి ఇంద్రసేన ఆధ్వర్యంలో గురువారం కూకట్‌పల్లిలో ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, డెంగీ జ్వరానికి కారణమైన దోమలు ఇళ్లల్లోనే పెరుగుతాయని, నీటిని నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వ ఉండే డ్రమ్ములు సిమెట్ తొట్లు, కుండలు, కూలర్లు, పూలకుండీల క్రింద ప్లేట్లు, నల్లా గుంతల్లో నీటిని పూర్తిగా తొలగించి, శుభ్రపరచాల్సిందిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ సుజాత, ఆర్పీలు పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

**నిజాంపేట్, జూలై 18, (ప్రభాతవార్త) :** శ్రీ వెంకట శివ శ్రీరామ లలితాదేవి ఆలయ ప్రాంగనంలో రెండ రోజులుగా తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, 17వ డివిజన్ కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ విద్యార్థులచే సాంస్కృతిక నృత్యప్రదర్శన, శ్రీహరి స్వరాలు క్లాసికల్ మ్యూజిక్ వారిచే అన్నమయ్య, త్యాగరాజ, రామదాజు కీర్తనలు ఆలాపన కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం నృత్య ప్రదర్శన, కీర్తనలు ఆడి, పాడిన చిన్నారులకు ఆలయ ధర్మకర్త ఆగంరాజు ముదిరాజ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలలో భాగంగా నీలిమ తమ కౌలస్య కాలనీ కోలాటం బృందం వారితో కలిసి ధర్మకర్త ఆగంరాజు ముదిరాజ్, సాంస్కృతిక కార్యక్రమంలో వారందరినీ అభినందిస్తూ వచ్చే సంవత్సరం కూడా ఇంకా బాగా జరుపుకుందామని తెలుపుతూ, అందరికీ తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు.



చినరాయుని చెరువు వద్ద కార్పొరేటర్ అధికారులు

## ప్రజామోదంతోనే సీవరేజ్ డైవర్షన్ పనులు

### కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి

**అల్వాల్, జూలై 18 (ప్రభాతవార్త):** చినరాయుని చెరువులో కలుస్తున్న నీటి దారి మళ్లింపు ప్రక్రియ ప్రజామోదంతోనే ముందుకు సాగుతుందని కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం నీటి పారుదల శాఖ అధికారులు ఎఫ్‌టిఎల్‌ఆర్ ప్లాట్స్ మార్గం పరిశీలనకు రాగా ఆనంద్ నగర్ కాలనీ వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పైపు లైనును రోడ్డు మధ్యలో నుంచి తీసుకెళ్లాలని వారు కోరారు. ప్రజల వినతిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డిఇ నరేంద్రకుమార్, ఎఇలు పృధ్వీ, మణికంఠ, ఎంహెచ్‌ఓ మంజుల, నేతలు మల్లేష్‌గౌడ్, వివిఎన్ రాజు, గిరి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమరు వీరులకు ఘన నివాళి



అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న బంధువులు

**అల్వాల్, జూలై 18 (ప్రభాతవార్త):** అల్వాల్ సుభాష్‌నగర్‌లోని అమర వీరుల స్థూపంవద్ద ప్రజాసంఘాల నేతలు అమరులకు నివాళులర్పించారు. అమరుల బంధు మిత్రులు సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జూలై 18వ తేదీన ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు విడిచిన వారిని స్మరించుకోవడం జరుగుతోంది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అమరుల కుటుంబ సభ్యులు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని కన్నీటిపర్యంతమయ్యారు. విప్లవ గీతాలతో సుభాష్‌నగర్ మార్మోగింది. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పద్మ కుమారి, అంజమ్మ, భవాని ఉష తదితరులు పాల్గొన్నారు.

## కిష్టయ్య కుటుంబానికి అండగా ఉంటాం : నీలం మధు

**పంజగుట్ట, జూలై 18 (ప్రభాతవార్త):** ఇద్దరు రైతుల మధ్య గట్టు పంచాయితీని రాజకీయ లబ్ధికి వాడుకోవడం సిగ్గుచేటని మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు వ్యాఖ్యానించారు. గురువారం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గజ్వేల్‌కు చెందిన రైతు కిష్టయ్యను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో కలసి పరామర్శించారు. భూమి పంచాయితీలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన కిష్టయ్యకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ముందుగా తక్షణ ఆర్థిక సహాయం కింద లక్షరూపాయలు అందించారు. అనంతరం మధు మీడియాతో మాట్లాడుతూ మాజీమంత్రి హరీష్‌రావు రాజకీయ లబ్ధికోసం ప్రయత్నిస్తున్నాడని ధ్వజమెత్తారు. కిష్టయ్యకు మరో రైతుతో గట్టు తగాదాలున్నాయని, సర్వేలో తనకు అన్యాయం జరిగిందని బాధపడి కిష్టయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం బాధాకరమన్నారు. అయితే ఈ విషయాన్ని మాజీమంత్రి హరీష్‌రావు రాజకీయంగా వాడుకుంటూ కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హేయమైన చర్య అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమమే ఎజండాగా ముందుకుపోతుందని ఇకనైనా ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం కిష్టయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్‌కు చెందిన పలువురు సీనియర్ కాగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఒలింపియాడ్ పాఠశాలలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ గ్యాలరీ ప్రారంభం

**కుత్బుల్లాపూర్, జూలై 18 (ప్రభాతవార్త) :** బాల్యదశ నుండే విద్యార్థుల్లో చదువుతోపాటు ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్‌లలో ప్రత్యేక శిక్షణ ఇప్పించి విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని బచ్‌పన్ ఒలింపియాడ్ పాఠశాలల చైర్మెన్ టి.కోటిరెడ్డి సూచించారు. గురువారం కుత్బుల్లాపూర్ డివిజన్ వెంకటేశ్వనగర్‌లోని బచ్‌పన్ ఒలింపియాడ్ పాఠశాలలో ఆర్ట్ ఆండ్ క్రాఫ్ట్ గాలరీని ఉపాధ్యాయులు ఉమామహేశ్వరీ, విద్యార్థులతోకలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్య, క్రీడలు వంటివాటితో పాటు చిత్రలేఖనం వంటి మెదడుకు పదునుపెట్టే విద్యలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈసదర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి బిపిఎస్ ఒలింపియాడ్ ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్‌ను ప్రారంభించారు.

## అందెశ్రీకి దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం

**నాంపల్లి, జూలై 18 (ప్రభాతవార్త) :** ఉభయ తెలుగు రాష్ట్రాలలో పేరెన్నిక గన్న తొలి తెలుగు గ్రంథాలయం శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం ప్రతియేటా ప్రదానంచేసే ప్రతిష్ఠాత్మక మహాకవి దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం ఈ ఏడాది తెలంగాణ ఉద్యమంలో ప్రజాచైతన్య పాటలు పాడిన ప్రజావాగ్గేయకారుడు, తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత అందెశ్రీని ప్రదానం చేయడానికి నిర్ణయించినట్లు భాషానిలయం గౌరవాధ్యక్షుడు డా. కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. రమణాచారి మీడియాకు తెలిపారు. పాటే ప్రజల జీవనవేదంగా అందెశ్రీ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, అంతకుముందు ప్రగతిశీల ఉద్యమాల ప్రభావంతో వందలాది గేయాలు రాసారని తెలిపారు. ఈ ఏడాది దాశరథి శతజయంతి వేడుకల ప్రారంభ సూచకంగా రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, దాశరథి కవిత్వం, వివిధ పార్శ్వాలను స్పృశిస్తూ పలువురు ప్రముఖ రచయితలు, విమర్శకులతో ఒకరోజు సదస్సు ఏర్పాటు చేయాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారాన్ని జులై 23వ తేదీ రాత్రి 6గంటలకు భాషానిలయంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పలువురు విశిష్ట అతిథులతో కలిసి అందెశ్రీకి అందజేస్తారని భాషానిలయం గౌరవ అధ్యక్ష కార్యదర్శులు డా. కె.వి.రమణాచారి, టి.ఉదయవర్లు తెలిపారు.

## సమగ్ర కులగణనకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలి

### బిసిజనసభ అధ్యక్షులు రాజారాం యాదవ్ డిమాండ్

**హైదరాబాద్, జూలై 18, (ప్రభాతవార్త):**

సమగ్ర కులగణన చేసి, స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పెంచాలని బిసిజనసభ అధ్యక్షులు రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్ల సమీక్షిస్తూ మాజీ మంత్రి, జానా రెడ్డి సలహాలు తీసుకోవాలంటూ ఆదేశించడాన్ని రాజారాం తప్పుపట్టారు. కులగణన విధివిధానాలకోసం సామాజిక శాస్త్రవేత్త ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి, మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు నేతృత్వంలో నిపుణుల కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజారాం మాట్లాడుతూ కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 7నెలలు గడుస్తున్నా సిఎం రేవంత్‌రెడ్డి కులగణనను ఏనాడు పెద్దగా పట్టించుకోలేదన్నారు. మొక్కుబడిగా శాసనసభలో తీర్మాణం ప్రవేశపెట్టి ,చేతులు దులుపుకున్నారే తప్పా ప్రణాళిక బద్ధంగా కార్యాచరణకు పూనుకోలేదని ఆరోపించారు. తక్షణమే కులగణన కోసం విధివిధాలను రూపొందించాలని అందుకు ఒక నిపుణుల కమిటీవేయాలని ఎటువంటి న్యాయపరమైన చిక్కులు ఏర్పడకుండా తక్షణమే కులగణన జరపాలని రాజారాంయాదవ్ డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో హిందూ మహాసభ అధ్యక్షులు సిద్దేశ్వర్, చామకూర రాజు, వికె గౌడ్, లొడంగి గోవర్ధన్, మహేష్‌గౌడ్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : ఎమ్మెల్యే



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సంజీవరెడ్డి నగర్, జూలై 18, (ప్రభాతవార్త)**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం సనత్‌నగర్‌లోని రవీంద్ర నగర్‌లో మొక్కలను ఆయన నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం వలన కలిగే ప్రయోజనాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు మనం ఇవ్వాల్సింది ఆస్తులు, అంతస్తులు కాదని, కాలుష్య రహిత వాతావరణం, ఆరోగ్యవంతమైన జీవితాన్ని అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీ, జిహెచ్‌ఎంసి ఈఈ ఇందిరా, డీఈ మోహన్, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, హార్టికల్చర్ అధికారి జోత్స్న, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, ఎస్సార్‌నగర్ సీనియర్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పి.శేఖర్, విజయ్‌సింగ్, జమీర్, రాజేష్ ముదిరాజ్, సరితాగౌడ్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



నారాయణమూర్తిని పరామర్శించిన వీహెచ్

## నారాయణమూర్తికి మెరుగైన చికిత్స అందించాలి

### మంత్రి దామోదర రాజనర్సింహ

పంజగుట్ట, జూలై 18 (ప్రభాతవార్త): ప్రముఖ నటుడు ఆర్.నారాయణమూర్తి ఆరోగ్య పరిస్థితిపై వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ నిమ్స్ డైరక్టర్ బీరప్పతో చర్చించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం స్థిరంగా ఉందని నిమ్స్ డైరక్టర్ మంత్రికి వివరించారు. ఆరోగ్య పరంగా అన్నిరకాల వైద్య పరిక్షలు చేస్తున్నామని అవసరమైన అన్ని చికిత్సలు చేయడానికి వైద్య బృందం సిద్ధంగా ఉందని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ నిమ్స్ డైరక్టర్‌కు ఆదేశాలిస్తూ అనుభవజ్ఞులైన డాక్టర్‌లచే నారాయణమూర్తికి వైద్యం అందించాలని కోరారు. కాగా నిమ్స్ ఆసుపత్రిలో రంగారెడ్డి బ్లాక్‌లో చికిత్స పొందుతున్న నారాయణమూర్తిని గురువారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, ఏపీ వైసీపీ నేత జూపూడి ప్రభాకర్‌రావు, సంగీత దర్శకులు బల్లేపల్లి మోహన్, సినీ గాయకులు అర్జున్, నిమ్స్ ఆసుపత్రి సూపరిండెంట్ సత్యనారాయణ తదితరులు పరామర్శించారు.

## గోల్కొండ జగదాంబకు పట్టువస్త్రాలు సమర్పణ

**చాంద్రాయగుట్ట, జూలై 18 (ప్రభాతవార్త) :** ఆషాడమాస బోనాల జాతర ఉత్సవాలను పురష్కరించుకొని గౌలిపురా కోటమైసమ్మ, మహంకాళి మాతేశ్వరి భారతమాత దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో గురువారం గోల్కొండ జగదాంబకు పట్టువస్త్రాలు, ఒడి బియ్యం సమర్పి చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్మని కైలాష్‌వీర్ గంగపుత్ర, కె.ఎస్.ఆనంద్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ప్రకాష్, మధుసూదన్ గిరి, బి.వై.శ్రీకాంత్, బొడ్డు సాయిబాబా, సుమన్, ఎం.రమేష్, మామిడి కృష్ణ, డల్లు శివ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీకి శుభాకాంక్షలు తెలిపిన మున్నూరు కాపు సభ్యులు

**వివేకానందనగర్ కాలనీ, జూలై 18, (ప్రభాతవార్త) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా మున్నూరు కాపు సంఘం సభ్యులు గురువారం ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాబోయే రోజుల్లోన్ల పార్టీని మరింత బలోపేతం చేయడానికి అందరి సహకారం కావాలని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి తన ధ్యేయమని అన్నారు. మున్నూరు కాపు నేతలు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే గాంధీ ఎంతగానో అభివృద్ధి చేశారని ఇంకా మరింత అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు నేతలు తెళ్ల హరికృష్ణ, తూము వినయ్ కుమార్, తూము ఎల్లారావు, పోతుల రాజేందర్, లక్ష్మీనారాయణ, నరేష్, అనిల్, శ్రీశైలం పాల్గొన్నారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**దుండిగల్, జూలై 18 (ప్రభాతవార్త):** ఇచ్చిన మాట ప్రకారం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసినందుకు గండిమైసమ్మ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. టపకాయలు కాల్చి స్వీట్లు పంపిణీచేసి సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకంచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతన్నలకు ఇచ్చిన మాట ప్రకారం రూ,2లక్షల రూపాయల రుణమాఫీ చేసినందుకు సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులకు రైతాంగం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్, బి బ్లాక్ అధ్యక్షులు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు మద్దికుంట నవీన్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సదానందం, నాయకులు యాదిరెడ్డి, శ్రీనివాస్, కిషోర్‌రెడ్డి, సురేష్, విజయ్ గౌడ్, చిరంజీవి, సీతారాంరెడ్డి, విజయ్‌కుమార్, నిరంజన్, రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

**కంటోనె మ్మంట్, జూలై 18 (ప్రభాతవార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గురువారం 8వ వార్డు బొల్లారంలోని ఓం సాయి కాలనీ, డౌటాన్ బజార్ వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను సిఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తెచ్చి తక్షణమే పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిరంలో బాబాను సందర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అదే విధంగా చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించి చిన్నారులకు మిఠాయిలు అందజేసి సంతృప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సదానంద్ గౌడ్, తేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

### కట్నం కోసం భార్యను కడతేర్చిన

## ఉపాధ్యాయునికి జీవిత ఖైదు

**సరూర్‌నగర్, జూలై 18 (ప్రభాతవార్త):** కట్నం కోసం కట్టుకున్న భార్యను వేధించి హత్య చేసిన కేసులో దోషిగా తేలిన ఉపాధ్యాయుడికి కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జల్‌పల్లి సమీపంలోని వాది-ఎ-ముస్తఫా కాలనీవాసి ఉపాధ్యాయునిగా పని చేసే మహమ్మద్ నసీరుద్దీన్ అలియాస్ ఫహదుద్దీన్ (26) ఏడు సంవత్సరాల క్రితం భార్యను కట్నం కోసం హింసించి తుదకు హత్య చేశాడు. దీంతో అతనిపై హత్య కేసు నమోదైంది. అయితే ఈ కేసులో నిందితుడు నసీరుద్దీన్‌ను దోషిగా తేలాడు. దీంతో రంగారెడ్డి జిల్లా రెండవ ఎడిజె కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చి నసీరుద్దీన్‌కు జీవిత ఖైదు విధించడంతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

## మైనర్ బాలికపై అత్యాచారం!

**సరూర్‌నగర్, జూలై 18 (ప్రభాతవార్త):** హైదరాబాద్ నగర శివార్లలో ఓ మైనర్ బాలికపై అత్యాచారం జరిగింది. మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బడంగ్‌పేట్ పాత గ్రామంకు ఆనుకొని ఉన్న ప్రధాన రోడ్డులో టిఫిన్ సెంటర్ నడుపుకునే ఓ వ్యక్తి కూతురు (14)పై కన్నేసిన ఓ కామాంధుడు అత్యాచారం చేశాడు. అయితే విషయమై బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బి.జాసన్

**చిక్కడపల్లి, జూలై 18 (ప్రభాతవార్త):** తెలంగాణ కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా బి.జాసన్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. కార్మిక శాఖలో ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా బి.జాసన్ ఏసిఎల్-2గా హైదరాబాద్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారు. కార్మిక శాఖలో బదిలీలు పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించిన ఆ శాఖ కమిషనర్ కృష్ణఆదిత్యకు ధన్యవాదాలు తెలిపారు. కార్మిక శాఖ కమిషనర్ కృష్ణఆదిత్య ఆధ్వర్యంలో అత్యంత చైతన్యవంతంగా పనిచేస్తోందని జాసన్ అన్నారు. ఈ శాఖలో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కమిషనర్ కొత్త ఒరవడి సృష్టించారన్నారు. కార్మికుల సమస్యలు వేగవంతంగా పరిష్కరించడానికి కృషి చేస్తానని బి.జాసన్ అన్నారు.

## చిరు వ్యాపారులకు న్యాయం చేస్తా

### ఎమ్మెల్యే తలసాని

**అడ్డగుట్ట, జూలై 18 (ప్రభాతవార్త):**

నల్లగుట్ట మారె ్కట్ జిచ్ఎంసీకి చెందిన దుకాణాలో ్ల వ్యాపారాలు చేసుకుంటున్న వారి అద్దెలను పెంచి చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయవద్దని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెలేయ తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను కోరారు. మారేడ్‌పల్లిలోని తన నివాసంలో నల్లగుట్ట మార్కెట్ వ్యాపారస్థులు గురువారం తలసానికి కలిసి జిహెచ్‌ఎంసి అధికారులు అద్దెలు పెంచుతామని నోటీసులు పంపుతామని బెదిరిస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. అటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకుంటామని తలసాని వారి హామీ ఇచ్చారు. ఈ క్యాక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, చిరువ్యాపారులు మహ్మద్ అలీ, అంజద్, హన్మంతరావ్, సై ్లాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిసి చైర్మన్ జైపాల్‌ను సత్కరించిన తెలంగాణ వడ్డెర సంఘం నేతలు

**అడ్డగుట్ట, జూలై 18 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర ఎం.బి.సి. చైర్మన్‌గా జెరిపటి జైపాల్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తెలంగాణ వడ్డెర సంఘం యూత్ అధ్యక్షులు వల్లపు శివకుమార్, జాతీయ అధ్యక్షులు వేడుల వెంకటేష్, గౌరవ అధ్యక్షులు రూపాని లోకనాధంలు మర్యాదపూర్వకంగా జైపాల్‌ను కలిసి శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నేతలు వల్లెపు గణేష్, దండుగుల శేఖర్, పల్లపు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### పరిశ్రమలోని కార్మికులకు పదవీ విరమణ

## వయసు 60 సంవత్సరాలకు పెంచాలి : చింతల నాగరాజు

**జీడిమెట్ల, జూలై 18, (ప్రభాతవార్త) :** జీడిమెట్ల పారిశ్రామిక వాడలో థర్మో కేబుల్ కంపెనీలో జనరల్ బాడీ సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనియన్ అధ్యక్షులు చింతల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ థర్మా కేబుల్ కంపెనీ యాజమాన్యం కార్మికుల పదవి విరమణ ప్రభుత్వాలు 62 సంవత్సరాలు పెంచితే, థర్మ కేబుల్ కంపెనీ కార్మికులకు 56 సంవత్సరాలకే రిటైర్మెంట్ చేస్తుందని నాగరాజుకు తెలిపారు. అనంతరం నాగరాజు కంపెనీ మేనేజ్‌మెంట్‌తో సమావేశం ఏర్పాటు చేసి కార్మికులకు రిటైర్మెంట్ 56 సంవత్సరాలకి పదవీ విరమణ చేయడం వలన కార్మికులు ఎంతో లాస్ అవుతారని, కార్మికులను శ్రమ దోపిడి చేపిస్తూ అన్యాయం చేస్తున్నారని కంపెనీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా కంపెనీ బ్యాలెన్స్ షీట్ చూపించవలసిందిగా నాగరాజు కోరారు. కంపెనీ యాజమాన్యం బ్యాలెన్స్ చూపించడానికి ముందుకు రాకపోవడంతో కంపెనీ మేనేజ్‌మెంట్‌కు 20 రోజుల సమయం ఇవ్వడం జరిగిందని ఈ సమయంలో కార్మికుల పదవీ విరమణ 60 సంవత్సరాలకు పెంచాలని లేదంటే ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తామని అలా కానిపక్షంలో డిప్యూటీ కమీషనర్ దృష్టికి తీసుకువెళ్లి కార్మికుల హక్కులను కాపాడుతామని కంపెనీ యాజమాన్యానికి హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో థర్మో కేబుల్ కంపెనీలో హెచ్‌ఆర్ మేనేజర్ మనోహర్‌రెడ్డి, యూనియన్ వైస్‌ప్రెసిడెంట్ ఫిలిప్స్, జనరల్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## గోషామహాల్ నియోజకవర్గంలో బిజెపి నేతల పాదయాత్ర

**అఫ్జల్‌గంజ్, జూలై 18(ప్రభాతవార్త):** ఆషాడమాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని గోషామహల్ నియోజకవర్గంలో ఉన్న దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలని వివిధ విభాగాల అధికారులను గోషామహల్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.రాజాసింగ్ ఆదేశించారు. గురువారం వివిధ విభాగాల అధికారులతోపాటు బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ కలిసి చాక్నవాడి, గోషామహల్ తదితర బస్తీలల్లో పాదయాత్ర చేశారు. ముఖ్యంగా బోనాల పండుగ సందర్భంగా దేవాలయాల వద్ద యుద్ధప్రతిపాదికపైన అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. ఈపాదయాత్రలో బిజెపి నాయకులు సురేష్, రఘు, జలమండలి, జిహెచ్‌ఎంసి అధికారులు పాల్గొన్నారు.

## రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే ఉపేక్షించం

**ముషీరారాబాద్, జూలై 18, (ప్రభాతవార్త):**

రోడ్లపై వ్యాపారాలతో వాహన దారులకు ఇబ్బందులు కలిగించ వద్దని ట్రాఫిక్ పోలీసులు చెప్పున్నప్పటికీ వారిలో మార్పు రావటం లేదు. అసలే వర్షాకాలం, ఆఫీసులకు త్వరగా వెళ్లాలన్నా, ఆఫీసుల నుండి ఇంటికి త్వరగా రావాలని వాహనదారులు ఎంత ప్రయత్నిస్తున్నప్పటికీ రోడ్లపై వ్యాపారాలతో ట్రాఫిక్ జామ్ అవుతూ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తోంది. ఇదే క్రమంలో లోయర్‌ట్యాంక్‌బండ్ నుండి కవాడిగూడ, గాంధీనగర్, సికింద్రాబాద్ వైపు వెళ్లేందుకు ధర్నాచౌక్ మీదగా నిత్యం వేలాది వాహనదారులు ప్రయాణిస్తూ ఉంటారు. ధర్నాచౌక్‌లో ప్రతి నిత్యం రోడ్డుపై వ్యాపారలు సాగించే వ్యాపారులు గతంలో ఉదయం పది గంటల వరకు మాత్రమే ఉండేవారు. కానీ ఇటీవల ట్రాఫిక్ పెరగటంతో వ్యాపారులు వారి వ్యాపారాలను రోజంతా కొనసాగిస్తూ ఉన్నారు. అందులోనూ వ్యాపారాలకు అడ్డాగా ధర్నాచౌక్ రోడ్డు మారిపోయింది. రోడ్డు పక్కనే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పెరిగిపోవటంతో తినటానికి వచ్చేవారు బండ్లను రోడ్డుపైనే పార్క్ చేస్తూ ఉండటంతో వాహనదారులు వెళ్లేందుకు దారి లేకుండా పోతోందని పలువురు వాపోతున్నారు.


**మహావీర్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్**

H.O.7-1-59/7, ఇండియన్ బ్యాంక్ ఎదుట, ప్లాస్టిక్ వరల్డ్ ప్రక్కన, అమీర్‌పేట, హైదరాబాద్-500016

టెలి: 040 23740534, ఇ-మెయిల్: ho@mahavaeerbank.com

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద ప్రకటన

**డిమాండ్ నోటీస్**

వీరికి:

**పొన్నాల కార్తీక్ మరియు పొన్నాల వెంకటేశ్వర్ రావు**

ప్లాట్ నం.39, శేషాచల కాలనీ, పోలీస్‌స్టేషన్ దగ్గర,

వెస్ట్ మారేడ్‌పల్లి, నెహ్రూ నగర్, సికింద్రాబాద్-500026.

ప్రదేశం : హైదరాబాద్
తేది : 11.07.2024

సర్,

రిఫరెన్స్: మీ రుణ ఖాతా **TL A/c No.00461120000069 & CAOD: 00461210000130.** పొన్నాల కార్తీక్ & పొన్నాల వెంకటేశ్వర్ రావు.

విషయం: సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద సెక్యూరిటీ ఇంట్రస్ట్ నోటీస్ యొక్క ఎన్‌ఫోర్స్‌మెంట్

1. మీరు మా బ్యాంక్, శంషీర్‌గంజ్ శాఖ నుండి ఈ క్రింద పేర్కొన్న క్రెడిట్ సౌకర్యాలు పొందారు.

| క్ర.సం. | వివరాలు | TL A/C NO - 004611200000069 | OD A/C NO - 00461210000130 |
|---|---|---|---|
| 1 | రుణ ఖాతా | Rs.25,00,000/- | Rs:15,00,000/- |
| 2 | వడ్డీ యొక్క రేట్ | 13% | 14% |
| 3 | మంజూరు తేది | 16-10-2021 | 16-10-2021 |
| 4 | కాలం | 96 నెలలు | 12 నెలలు |
| 5 | EMI | Rs.42,018/- | ఎప్పుడు మరియు అలా వర్తించే వడ్డీ |
| 6 | చెల్లించవలసిన బకాయి | Rs 1,65,139/-(3.93EMIs) | 68743.10 |
| 7 | 30.06.2024 నాటికి బకాయి మొత్తం | Rs 21,08,390/- | RS 15,68,743.10 |
| 8 | సెక్యూరిటీ | P. వెంకటేశ్వర్‌రావు మరియు P. కార్తీక్‌కు చెందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్, వెస్ట్ మారేడ్‌పల్లి వద్ద ఉన్న శేషాచలం కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ యొక్క లేఅవుట్‌లోని 133.33 చ.గజాల adm భూమి, సర్వే నం.3, 4, 10, 11 & 19, SCB 5-15-022, ప్లాట్ నం.39 యొక్క Eq mts అదంతా. | |
| 9 | సెక్యూరిటీ తనఖా | డాక్యుమెంట్ నం.1924/2021 తేదీ: 11.10.2021 ప్రకారం మీచే ఈక్విటబుల్ తనఖా సృష్టించబడి, బోయినపల్లి యొక్క సబ్ రిజిస్ట్రార్‌తో రిజిష్టర్డ్ అయిన తనఖా మరియు బోయినపల్లి యొక్క సబ్ రిజిస్ట్రార్‌తో రిజిష్టర్డ్ డాక్యుమెంట్ నం.337/2021 తేది: 04.02.2021 ప్రకారం "పాయింట్ నం.7"లో రిఫర్ చేయబడిన పైన పేర్కొన్న ఆస్తికి చెందిన ఒరిజినల్ టైటిల్ డీడ్స్ యొక్క డిపాజిట్. | |

2) EMI యొక్క సక్రమం కాని/చెల్లింపు లేని కారణంగా ఖాతా సక్రమంకానిదై మరియు 30.06.2024న NPAగా వర్గీకరింపబడినది. టెరమ్ లోన్ ఖాతా నం.004611200000069లో చెల్లించవలసిన బకాయి మరియు **OD A/c నం.00461210000130, 10.07.20224** నాటికి **1,65,139/- మరియు 68743.10 మొత్తం రూ.2,33,882.10 (రెండు లక్షల ముప్పై మూడు వేల ఎనిమిది వందల మరియు ఎనభై రెండు మరియు పది పైసలు మాత్రమే). 30.06.2024** వరకు వడ్డీ కలిసినది. RBI మార్గదర్శకాల ప్రకారం ప్రస్తుతం మీ ఖాతా **30.06.2024** నుండి NPA A/c "సబ్ స్టాండర్డ్"గా మార్చబడినది.

3) మేము పలుమార్లు డిమాండ్‌లు మరియు ఫోన్ కాల్స్ చేసినప్పటికీ మీరుగానీ లేదా మీ హామీదారుడుగానీ టెరమ్ లోన్ ఖాతా యొక్క బకాయి మొత్తం క్లియర్ చేయలేదు. 2023 ఆగస్టు నుండి ముందుగా మేము చాలా సార్లు పలు రీకాల్స్ జారీ చేయడమైనది.

4) అందువలన ఇందుమూలముగా మీకు పిలుపు ఇచ్చునది ఏమనగా సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002 యొక్క ఏర్పాట్లు ప్రకారం బ్యాంక్ సెక్యూర్డ్ క్రెడిటార్‌లు అయినందున, ఈ నోటీస్ యొక్క తేదీ నుండి 60 రోజులలోపుగా మీరు పూర్తిగా చెల్లించవలసిన రుణం, బాధ్యత నిర్ధారించే విధంగా మరియు 01.07.2024 నుండి భవిష్యత్ వడ్డీతో 30.06.2024 వరకు వడ్డీ కలుపుకొని రూ.36,77,133.10 (ముప్పై ఆరు లక్షల డెబ్బై ఏడు వేల ఒక వంద మరియు ముప్పై మూడు మరియు పది పైసలు మాత్రమే) మొత్తాన్ని చెల్లించవలసినదిగా మీకు పిలుపు ఇవ్వడమైనది. మీరు విఫలమైతే మీచే సృష్టించబడిన డాక్యుమెంట్ నం.1927/2021 తేది: 11.10.2021 ప్రకారం బోయినపల్లి యొక్క జిల్లా రిజిస్ట్రార్‌తో టైటిల్ డీడ్స్ యొక్క మెమొరాండమ్ ఆఫ్ డిపాజిట్ ఆస్తికి సంబంధించిన చట్టం క్రింద ఇవ్వబడిన అన్ని హక్కులు మేము నిర్బంధంగా ఎన్‌ఫోర్స్ చేయవలసి ఉంటుందని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

5. తదుపరి, 60 రోజులలో మొత్తం బకాయిలు తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైతే మరియు చట్టం ప్రకారం బ్యాంక్ అన్ని హక్కులు వినియోగించుకున్నప్పటికీ, బకాయిలు అన్నీ సంతృప్తికరంగా సెక్యూర్డ్ ఆస్తుల యొక్క విక్రయ ప్రొసీడ్స్‌తో చెల్లింపు పరిష్కరించకపోయినట్లయితే, మేము TS కో-ఆపరేటివ్ సొసైటీల చట్టం యొక్క ఏర్పాట్లు ప్రకారం మిగిలిన మొత్తం సొమ్ము రికవరీ నిమిత్తం మీపై మధ్యస్థ పరిష్కార వ్యవహారానికి తప్పక ఉపక్రమించవలసి ఉంటుందని మిమ్మల్ని గమనించవలసినదిగా సూచించడమైనది.

6. ఈ నోటీస్ స్వీకరించిన పిమ్మట, చట్టప్రకారం పై సెక్యూరిటీలకు సంబంధించి ఎటువంటి డీలింగ్ లేదా విక్రయం చేయడానికి మీరు ఆపివేయడం/అదుపు చేయబడుతున్నారని బ్యాంక్ యొక్క అనుమతి లేకుండా మామూలు వ్యాపార వ్యవహారాలు తప్ప మీరు ఏమీ చేయకూడదని గమనించవలసినదిగా ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఈ చట్టాన్ని ఏవిధంగా అతిక్రమించినా తీవ్రమైన పరిణామాలు తప్పవని దయచేసి గమనించవలసినదిగా సూచించడమైనది.

**హామీదారునికి కాపీ: పొన్నాల విజయ లక్ష్మి - W/o. P. వెంకటేశ్వర రావు,**
ప్లాట్ నం.39, శేషాచల కాలనీ, నెహ్రూ నగర్, వెస్ట్ మారేడ్‌పల్లి, హైదరాబాద్
**పొన్నాల రాములు - S/o రాజయ్య పొన్నాల,**
ప్లాట్ నం.39, శేషాచల కాలనీ, నెహ్రూ నగర్, వెస్ట్ మారేడ్‌పల్లి, హైదరాబాద్

మీ విశ్వసనీయ
మహావీర్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
సం/- (శ్రీ విజయ్ కుమార్ చౌధరి)
MD/CEO/అధీకృత అధికారి



**IN THE COURT OF THE HON'BLE X ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD**
**G.W.O.P.No.14 of 2024**

Between:
**Smt. Sheetal Malu & Others ...Petitioners**
AND
**All Concerned ...Respondents**
To,
**All Concerned**
This is to inform the general public that petitioners have filed petition under Section 29 of the Guardians and Wards Act, 8 of 1890 read with Section 8 of Hindu Minority and Guardian Ship Act. The said GWOP is posted on **07.08.2024 at 10.30 A.M.** if anybody has any objections kindly appear before the above Hon'ble Court on 07.08.2024 at 10.30 A.M. either in person or through advocate, failing which the matter will be decided in your absence as per law.
// BY ORDER OF THE COURT //
**Sd/- MOHD SHANOOR**
**Advocate**
Office at 11-6-648, Opp 2nd Gate, Criminal Courts, Nampally, Hyderabad-04. **Cell: 9347096786**



**IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: KUKATPALLY**
**S.O.P.No. 04 of 2024**

Between:
**1. Smt Tiruvaipati anakkamma and two others ...Petitioners**
AND
**1. Govt. of India Post Office,** Rep. by Dy. Sub Post Master, Miyapur Post Office, R.R.District - 500049.
**2. To whom So Ever Concerned ...Respondents**
To ,
Whom so Ever it may Concerned
Please take notice that the petitioners are filed the above SOP for declaring the successor of Late Tiruvaipati Ranganayakulu with regard to the deposits laying the first respondent.
Therefore, the General Public are hereby informed that if any person or persons have got any objection can file such objection along with proof and material evidence, either in person or through counsel duly instructed, at **10.30 AM on 23-08-2024** before the above said Honble Court, failing which the matter will be proceeded further on merits.
(By Order of the Court)
**P. VENKATA CHARY**
**Advocates,**
Plot No. 50, Raod No.2 Chitraseema Coloy, Vanasthalipuram, Hyderabad.
**Ph.No.9704482581**



**IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-I ADDL. METROPOLITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DISTRICT : AT MALKAJGIRI**
**O.S.No. 521 of 2024**

Between:
**Kulkarni Lakshmi Bai & Others ...Plaintiffs**
AND
**1. The Tahsildhar,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri District
**2. All concerned ...Defendants**

**NOTICE**

To
**1. All concerned**
**Defendant No.2**
Please take notice that, the Plaintiffs filed the above suit against you for declaration of Plaintiffs as legal heirs of Late Kulkarni Digamber Rao @ Rama Rao Joshi and the same is posted on **02.08.2024.** That the general public who ever may concerned can appear before the above said Hon'ble Court on **02.08.2024 at 10.30 AM** with objections if any in support of your claim or else the Hon'ble Court will proceed for granting legal heirs certificate in favour of the Plaintiffs.
//BY ORDER OF THE COURT//
**Sd/- J. SATHYANARAYANA, D. SHAM SUNDER & I. SRINIVAS**
**Advocates**
H.No.10-456/2. PVN Colony, Malkajgiri, Hyderabad 500047
**Cell No.8985803501, 8555998931**



**PUBLIC NOTICE**
**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE: C.C.C: SECUNDERABAD**
**O.S NO. 243 OF 2024**

Between:
**1. Kamla Kumar Sharma** S/o. Sheoji Sharma, Aged 53 Years, Occ: Pvt. Service.
**2. Smt. Pushpa Sharma,** W/o. Kamla Kumar Sharma, Aged 50 Years, Occ: House wife
**3. Suman Sharma,** D/o. Kamla Kumar Sharma, Aged 32 years,Occ: Student
**4. Pooja Sharma,** D/o. Kamla Kumar Sharma, Aged 30 years,Occ: Student
(All are resident of Flat No.101, Avenue Road No.3, Mallikarjuna Colony, Old Bowenpally, Secunderabad - 500 009
**....Plaintiffs**
And
**1. All Concerned**
**2. Mandal Revenue Officer,** Bowenpally Mandal, Parkview Enclave, Old Bowenpally, Secunderabad - 500 009.
Please take notice in the above suit that the above named Plaintiffs have instituted a Suit for Declaration of Legal heirs against you and you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to above case or who shall be accompanied by some persons able to answer all such questions on **26th July 2024 at 10:30 AM,** failing which the suit will be heard and determined in your absence.
By order of Hon'ble XI Junior Civil Judge, CCC, Secunderabad
**Sd/- A. SRINIVASA CHARY**
**Advocate**
**Counsel for Plaintiffs**
**Cell: 9949593033**



**COURT NOTICE**
**IN THE COURT OF THE HON'BLE II SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD.**
**O.S.No. 3576 OF 2023**

BETWEEN:
**Fathima Begum,**
D/o. Shaik Hyder, Age:29 years, R/o. 8-3-169/60/1339/37, Kamalanagar, Shivamma Papireddy Hills, Yousufguda, Hyderabad-45.
**...Plaintiff**
AND
**1. D. R. Radha Krishna,** S/o. Late Mahesh, age: Major, R/o. 8-3-169/BJN/5/G, Yousufguda, Hyderabad-45.
**2. D. R. Vishal,** S/o. Late Mahesh, age: Major, R/o. 8-3-169/BJN/5/G, Yousufguda,Hyderabad-45.
**....Defendants**
Please take Notice that the Plaintiff herein has filed the above Suit vide O.S. No. 3576 of 2023, before the Hon'bleVJunior Civil Judge, City Civil Courts At Hyderabad against the Defendants. In this matter the Hon'be court was pleased to permit the plaintiff, to take up serving of summons on Defendants through Paper Publication. The said matter, i.e., O.S. No. 3576/2023, on the Hon'ble V Junior Civil Judge, City Civil Courts,At Hyderabad, is posted for appearance on **05-08-2024, at 10:30 am** and herebyyou are requested to appear on the said date and time, either in person or through your counsel before the above said Hon'ble court. In case you fail to appear on the above said date, the matter will be decided Ex-parte in your absence.
//BY THE ORDER OF THE HON'BLE COURT//
**MASTAN VALI SHAIK**
**ADVOCATE**
Flat No.G-1, BharathiNilayam Apartment, Women's Cooperative Society, Road No.2, Jubilee Hills, Hyderabad. **Cell No. 9059886757.**

# వర్షం పడితే భయం.. భయం

## కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు మూతలు లేని ఫ్యూజ్ బాక్సులు నిప్పురవ్వలు చిమ్ముతున్న విద్యుత్ తీగలు అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ ప్రమాదాలు



రాగన్నగూడ, ఎస్సీ బస్తి 10, 21వ వార్డు పరిధిలో ఇళ్ల మధ్య ప్రమాదకరంగా దర్శనమిస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

**తుర్కయంజాల్, జూలై 18 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ 10వ వార్డు ఎస్సీ బస్తి, రాగన్నగూడ, శ్రీరామనగర్ కాలనీ, కమ్మగూడ పరిధిలో కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు, అస్తవ్యస్తంగా వేలాడుతున్న తీగలు ఇక్కడే కాదు తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి చోటా ఇదే పరిస్థితి. వర్షాలు పడినప్పుడు ప్రజలపట్ల విద్యుత్ వైర్లు యమపాశాలుగా మారుతున్నాయి. గాలి దుమారం వస్తుందంటే ప్రజలకు హడలే, తీగలు ఎక్కడ తెగిపడతాయే.. ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంభయంగా గడుపుతున్నారు. అయినా అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడ చూసినా ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయని అధికారులు ఏదైనా ప్రమాదం జరిగితే గాని పట్టించుకోరా, అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీ మెగా టౌన్‌షిప్ ప్రక్కన కాలనీతోపాటు తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలు ఒకదానికొకటి తాకుతున్నాయి. "గాలివానకు చెట్ల కొమ్మలు విరిగి తీగలపై పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఫిర్యాదులు చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని, గాలి దుమారానికి మంటలు వస్తుండటంతో ప్రజలు భయపడిపోతున్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ చర్యలు లేకుండా ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. కోహెడ ఎల్లమ్మ టెంపుల్ దగ్గర కాలనీ ఎదురుగా ఉన్న వీధిలో స్తంభం వైర్లు ఇండ్లకు ఆనుకొని పైనుంచే వేయడంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ కాలనీ వాసులు భయంతో వణికి పోతున్నారు. ఇళ్లపై వైర్లు వెళ్తున్న విద్యుత్ వైర్లను ఇంటికి దూరాన పెట్టాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ వేయాలని ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ స్థంబాలనుంచి మంటలు రావడం. షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు కాలిపోవడం, గోడలు పట్టుకుంటే షాక్ కొట్టడం వంటి సమస్యలతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి రూ. 25 లక్షలు విరాళం



విరాళాన్ని అందజేస్తున్న శ్రీరామ సుబ్రహ్మణ్యశర్మ

**వనస్థలిపురం, జూలై 18 ప్రభాతవార్త:** బి.యన్.రెడ్డినగర్ డివిజన్ సాగర్ కాంప్లెక్స్ కాలనీ శ్రీ రేణుకా రాజరాజేశ్వరి పీఠం జగన్మాత సేవలో నవీన్ శర్మ, డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సమక్షంలో శ్రీ శ్రీ శ్రీ అభయ అయ్యప్ప సేవా సమితి శ్రీ రామ సుబ్రహ్మణ్యం శర్మ టీచర్స్ కాలనీలో నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి దేవాలయాన్ని నిర్మించుకునేందుకు 25 లక్షల రూపాయలు విరాళం ప్రకటించారు అందులో భాగంగా గురువారం 5 లక్షల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించుకునేందుకు 25 లక్షల రూపాయలను విరాళంగా ఇవ్వడం చాలా సంతోషకరంగా ఉందని. వారికి వారి కుటుంబానికి స్వామి వార్ల ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వల్లపురెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్, ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ కొండల్‌రెడ్డి, సెక్రటరీ బుచ్చిరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, రవీందర్ రెడ్డి, ఆదిత్యశర్మ, విష్ణువర్ధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మంత్రాల చెరువు సుందరీకరణ పనులు నాణ్యంగా ఉండాలి : ఎమ్మెల్యే సబితారెడ్డి



వాకింగ్ ట్రాక్‌పై ఏర్పాటు చేసిన సందర్శకుల బెంచీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**సరూర్‌నగర్, జూలై 18 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో తీర్చిదిద్దబడుతున్న మీర్‌పేట్ మంత్రాల చెరువు సుందరీకరణ పనులను ఎమ్మెల్యే, మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె చెరువు ప్రాంతంలో సుందరీకరణ పనులను పరిశీలించారు. ప్రజలకు చక్కనిఆహ్లాదాన్ని అందించే విధంగా చెరువును తీర్చిదిద్దిస్తానని స్పష్టం చేశారు. నాలుగు కాలాల పాటు మన్నేలా సుందరీకరణ పనులు నాణ్యంగా చేయాలని ఆమె సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లెల కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు బొక్క రాజేందర్‌రెడ్డి, సిద్దాల లావణ్యబీరప్ప, కార్పొరేషన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, నాయకులు పంతంగి మాధవి వెంకటేశ్వరరావు, సిద్దాల పెద్ద బీరప్ప, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిల్వేరు సాంబశివ, వీరురెడ్డి, గీత తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఘనంగా మొహర్రం వేడుకలు

**ఉప్పల్, జూలై 18 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ భరత్‌నగర్, పాత రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పీర్లకు దట్టీలు సమర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా మొహర్రం నిలుస్తుందన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం పండుగ చేసుకుంటారని, ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు ఐక్యమత్యంతో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఎం.డి.తౌఫిక్, రఫీక్, ముస్తాక్, ఉపేందర్, నామ్ రాజిరెడ్డి, సతీష్‌గౌడ్, తైసిన్, జంగయ్య, ముత్యాల బాబు, అలీమ్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి సిఎం రేవంత్‌రెడ్డి కృషి



రాహుల్, రేవంత్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**మలక్‌పేట, జూలై 18 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ పథకాన్ని అమలు చేయడంతో మలక్‌పేట మార్కెట్‌లో చెకోలేకర్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే సాహోసోపేతమైన నిర్ణయం రైతు రుణమాఫీ అని అదే కేవలం సిఎం రేవంత్‌రెడ్డితోనే సాధ్యమైందన్నారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రైతులు సంతోషంగా ఉండాలని సిఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీని చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ షకీల్, చక్రపాణి, రాహుల్‌సింగ్, షాహిద్, ఖాన్, లింగాల శ్రీనివాస్‌గౌడ్, సంతోష్ యాదవ్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుపూర్ణిమ మహోత్సవ పత్రిక ఆవిష్కరణ



గురుపూర్ణిమ పత్రికను ఆవిష్కరిస్తున్న దేవాలయం సభ్యులు

**ఎల్.బి.నగర్, జూలై 18 ప్రభాతవార్త:** దిల్‌షుఖ్‌నగర్‌లోని శ్రీషిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి 22 వరకు శ్రీ గురుపూర్ణిమ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ శ్యామ్‌కుమార్ తెలిపారు. శ్రీగురుపూర్ణిమ మహోత్సవాలకు సంబంధించిన పత్రికను గురువారం సాయిబాబా సన్నిధిలో దేవాలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఉత్సవాలలో భాగంగా శ్రీసాయిబాబా వారికి మంగళస్నానము, అర్చన, వేద ఆశీర్వచనము, శ్రీగురుచరిత్ర పారాయణము, 108 మంది మహిళా భక్తులతో శ్రీసాయి కలశ దీపములతో శోభాయాత్ర, సాయిబాబా వారి రథోత్సవం, విశేష పల్లకి శోభాయాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ప్రతినిధులు రఘు కుమార్, గుండా మల్లయ్య, బచ్చు గంగాధర్, వనం యాదయ్య, రాజశేఖర్, కిరణ్, ఆర్ఎస్.శంకర్‌రావు, పద్మాకర్ ఆత్రేయ పాల్గొన్నారు.

## ఆలయాల వద్ద పనులను త్వరగా పూర్తి చేయాలి : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



దేవాలయ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, జూలై 18 ప్రభాతవార్త:** మూసారాంబాగ్ డివిజన్‌లోని దేవాలయ వద్ద త్వరగా పనులను పూర్తి చేయాలని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. రానున్న బోనాల పండుగను పురస్కరించుకుని ఆలయాల వద్ద ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు, సిసి రోడ్డు నిర్మాణ పనులను సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల పండుగ దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, నాయకులు సంతోష్, బాలరాజు, శ్రీకాంత్, సురేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ప్రసాదం పంపిణీ : ఉప్పల

**ఎల్.బి.నగర్, జూలై 18 ప్రభాతవార్త:** టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త గురువారం సాయిబాబా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. నాగోల్ డివిజన్ కో-ఆపరేటివ్ బ్యాంకు కాలనీలోని ఉప్పల నివాసం వద్ద ద్వాదశి సందర్భంగా పలువురు భక్తులకు సాయిబాబా అన్నప్రసాదాన్ని అందజేసినట్లు శ్రీనివాస్ గుప్త తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల స్వప్న, ఉప్పల సాయితేజ, ఉప్పల సాయికిరణ్ పాల్గొన్నారు.

## అల్కాపురిలో బాలమురళీకృష్ణ జయంతి

**ఎల్.బి.నగర్, జూలై 18 ప్రభాతవార్త:** భారతీయ కళా సమితి ఆధ్వర్యంలో డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 94వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్కేపురం డివిజన్ అల్కాపురి పార్కులో బుధవారం రాత్రి భారతీయ కళా సమితి నిర్వాహకుడు తాండవ కృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కుమారి శర్వాణి భరతనాట్యం, ఎస్ఎస్.శశాంక మృదంగం తదితర కార్యక్రమాలను నిర్వహించి సంగీత ప్రియులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా సౌత్ సెంట్రల్ రైల్వే ఐఆర్ఎస్ రామకృష్ణ, శంకర్ ధర్మాధికారి శ్రీనివాస్ హాజరయ్యారు.

## బోనాల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించాలి : కార్పొరేటర్ సుజాతనాయక్

**వనస్థలిపురం, జూలై 18 ప్రభాతవార్త:** హస్తినాపురం డివిజన్ నందనవనంలో బోనాల పండుగను పురస్కరించుకుని కార్పొరేటర్ బానోత్ సుజాతనాయక్ పర్యటించారు. ఈసందర్భంగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని డివిజన్ పరిధిలోని నందనవనం దేవినగర్ కాలనీలోని అమ్మవారి దేవాలయాలను సందర్శించుకుని బోనాల పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత జిహెచ్ఎంసి ఏఈ హేమునాయక్‌ను ఆదేశించారు. అనంతరం బోనాల పండుగకు సంబంధించిన దేవాలయాల చెక్కులను అందించారు. కార్యక్రమంలో రాజుగౌడ్, నరసింహ, సతీష్‌గౌడ్, గోపిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనిత, మధు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ డివిజన్‌గా చిలుకానగర్ : గీత ప్రవీణ్

**ఉప్పల్, జూలై 18 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం చిలుకానగర్ నవోదయ కమ్యూనిటిహాల్ వద్ద కొత్త విద్యుత్ స్థంభం ఏర్పాటుతోపాటు, ట్రాన్స్‌పార్మర్ మంజూరు చేయించారు. అక్కడే ఉండి పనులు చేయించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఒంగిపోయిన విద్యుత్ స్థంభాలు తొలగించి కొత్త స్థంభాలు వేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బాలేందర్, రాజ్‌కుమార్, నర్సింగ్, సంతోష్, నరేష్, శ్రీనివాస్,అంబిక తదితరులు పాల్గొన్నారు.

## ఆర్య వైశ్యులకు కేంద్ర ప్రభుత్వం చేయూత



ప్రమాణస్వీకారోత్సవంలో ప్రసంగిస్తున్న ఎంపి ఈటల రాజేందర్ తదితరులు

**రామంతాపూర్, జూలై 18 ప్రభాతవార్త :** ఆర్యవైశ్యులకు కేంద్ర ప్రభుత్వం తగు చేయూత అందిస్తుందని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రామంతాపూర్‌లో శ్రీ వాసవ కన్యకా పరమేశ్వరి ఆలయ ట్రస్ట్ కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఎంపి ఈటల రాజేందర్‌తోపాటు, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, పౌండర్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్త, వైస్ చైర్మన్ ఉడుత పురుషోత్తంగుప్త, ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈటల మాట్లాడుతూ ఆర్యవైశ్యులు కష్టపడి జీవనం సాగిస్తారని, వ్యాపార రంగంలో వారికి తిరుగు లేదన్నారు. ఆర్యవైశ్యులకు ప్రత్యేక భవనంతోపాటు వారికి అన్ని రంగాల్లో చేయూత అందించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రత్యేకంగా నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం ఆలయ ట్రస్ట్ కమిటి సలహాదారులు సంబు పాండయ్యగుప్త, అధ్యక్షుడు బోనగిరి శ్రీనివాసులుగుప్త, ప్రధాన కార్యదర్శి గట్టు ప్రకాష్‌గుప్త, కోశాధికారి వూరే నగేష్‌గుప్త, సహాయ ప్రధాన కార్యదర్శి యెనిశెట్టి కొండయ్యగుప్త, సహాయ కోశాధికారి కొర్రివాడ శ్రీనివాస్‌గుప్త, న్యాయ సలహాదారులు పెంద్యాల సతీష్‌గుప్త తదితరులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా మహిళ కమిటి ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్య వైశ్య సంఘం నేతలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## హాస్టళ్ల నిర్వహణతో శాంతిభద్రతలకు ముప్పు : కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి



సుజాతకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 18 ప్రభాత వార్త:** విచ్చలవిడిగా ప్రైవేటు హాస్టల్లో ఏర్పాటుతో డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు ముప్పు వాటిలో ప్రమాదం ఉందని గడ్డి అన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని హాస్టల్ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాతకు గురువారం కార్పొరేటర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్లోని హాస్టల్స్ వల్ల కాలనీలో నివసిస్తున్న ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా డివిజన్లో అక్రమంగా హాస్టల్స్ నడుపుతున్నారని, అక్రమ హాస్టల్స్ వల్ల స్థానికంగా సానిటేషన్, డ్రైనేజీ, పార్కింగ్, శాంతిభద్రతల సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా విషయాలను పరిగణంలోకి తీసుకొని అన్ని హాస్టల్స్‌కి సమచారం ఇచ్చి అన్ని విభాగాల అధికారులతో ముఖ్యంగా పోలీస్ విభాగం అధికారులతో కలిసి ఒక సమావేశం ఏర్పాటు చేసి హాస్టల్స్ యాజమాన్యాలకు కొన్ని నిబంధనలు పాటించాలని హెచ్చరిస్తే ప్రజలు పడుతున్న ఇబ్బందుల నుండి ఊరట కలిగించవచ్చని తెలిపారు. జిహెచ్ఎంసిలో హాస్టల్స్‌కి ఏమైనా విధివిధానాలు ఉన్నాయా, ఉంటే వివరాలు ఇవ్వాలని, గడ్డిఅన్నారంలో ఎన్ని హాస్టల్స్ జిహెచ్ఎంసి అనుమతులతో నడుస్తున్నాయి, ఎన్ని అక్రమ హాస్టల్స్ ఉన్నాయనే ప్రశ్నకు అధికారుల నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదన్నారు. వెంటనే సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## బ్యాంక్ ఉన్నతికి వినియోగదారులే మూలం... మేనేజర్ అబ్దుల్ రెహమాన్



ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్‌ను సత్కరిస్తున్న విశ్వకర్మ ట్రస్ట్ కాప్రా బృందం...

**కుషాయిగూడ, జూలై 18 ప్రభాతవార్త :** వినియోగదారులే బ్యాంకు ఉన్నతికి ప్రధాన కారణమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాప్రా సాకేత్ బ్రాంచ్ మేనేజర్ అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ సాకేత్ వద్ద గల కాప్రా ఎస్బిఐ బ్యాంకులో బదిలీపై వచ్చిన అబ్దుల్ రెహమాన్ కొద్ది రోజులలోనే వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు బ్యాంకు ఖాతాదారులను పెంచడంతో పాటు లావాదేవీల నిధుల శాతం కూడా పెరిగిన సందర్భంగా కాప్రా విశ్వకర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులంతా ఖాతాదారులు, వినియోగదారుల పట్ల మర్యాదగా వినమ్రతగా నడుచుకొని సేవలందించాలన్నారు. గత కొద్ది రోజులుగానే సీనియర్ సిటిజన్లకు, నిస్సహాయులైన వారికి అందిస్తున్న సేవలకుగాను ఆయనను సన్మానించి, మేనేజర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హోమ్ లోన్స్ ఇన్చార్జి రవీందర్, విశ్వకర్మ ట్రస్ట్ స్థల దాత మారోజు నరసింహాచారి, ట్రస్టు సభ్యులు నాగేశ్వర రావు, వడ్లోజు జ్యోతిర్మయాచారి, కృష్ణమాచారి, ఆనంద్‌చారిలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని పూజలు



పూజలు నిర్వహిస్తున్న రాజిరెడ్డి, రాఘవాచారి

**సైదాబాద్, జూలై 18 ప్రభాతవార్త:** ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ చంపాపేట డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో బిఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఏఐజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వింజమూరి రాఘవాచారి, ఉమా మహేశ్వర్, సురేందర్‌రెడ్డి, బొంబాయి యాదయ్య, జగదీష్, చందు యాదవ్, సత్తిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు సన్మానం

**సరూర్‌నగర్, జూలై 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కె.శివసేనారెడ్డిని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సామిడి చరణ్‌రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆయనను కలిసిన చరణ్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మధు, శివ, గౌతమ్, మనోజ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## జల్‌పల్లి మున్సిపాలిటీలో సానిటేషన్ తీరుపై సబితా ఇంద్రారెడ్డి అసంతృప్తి

### నిర్వహణ సక్రమంగా లేదంటూ ఆగ్రహం.. స్పెషల్ డ్రైవ్ చేయాలని ఆదేశం



జల్‌పల్లి మున్సిపాలిటీ పారిశుధ్యంపై సమీక్ష నిర్వహిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 18 ప్రభాతవార్త:** జల్‌పల్లి మున్సిపాలిటీ వార్డుల్లో అధ్వాన్న పారిశుధ్య పరిస్థితులపై స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో కాలనీలు, బస్తీల్లో పారిశుధ్యం దారుణంగా ఉండడంపై ఆమె సంబంధిత సానిటేషన్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం జల్‌పల్లిలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే పారిశుధ్యంపై ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ వార్డుల్లోని పలు ప్రాంతాల్లో సానిటేషన్ నిర్వహణతీరు బాగాలేదంటూ ఆమె అధికారులపై కొంత ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్యాన్ని సక్రమంగా నిర్వహించకపోవడంలో జరుగుతున్న అలసత్వంపై ఆమె అధికారులను ప్రశ్నించారు. అసలే వర్షాకాలం కావడంతో పారిశుధ్య సమస్యలు తీవ్రమైతే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్యం సక్రమంగా ఉండేలా చూడాలని ఆమె సూచించి దిశానిర్దేశనం చేశారు. వార్డుల్లో సానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ చేయాలనీ ఈ విషయంలో స్థానిక వార్డు కౌన్సిలర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె అన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో తాను పాల్గొని పర్యవేక్షిస్తానని సబితారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ ఛైర్‌పర్సన్ ఫర్హానా నాజ్, కమీషనర్ వాణిరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి కృషి : మొద్దు లచ్చిరెడ్డి



అభివృద్ధి పనుల గురించి జడ్‌సి, డిసిలకు వివరిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, జూలై 18 ప్రభాతవార్త:** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ ఫేస్ 1లో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిప్యూటీ కమిషనర్ యాదయ్య, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రధాన సమస్యలైనా పార్కింగ్, రోడ్స్, వీధి దీపాలు, కరెంటు స్తంభాలు ఏర్పాటు, పార్క్ అభివృద్ధికి కృషి చేయాలని కాలనీవాసులు కోరారు. ఇందుకు స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేయడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని, డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. అనంతరం కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌ను కాప్రాయి చెరువు కట్ట సుందరీకరణ చేయాలని కోరడంతో సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ డివిజన్‌లోని ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు.కార్యక్రమంలో డి.సి. సువర్చల, ఇఇ రమేష్ బాబు, ఎసిపి పావని, ఎ.డి. దామోదర్‌రావు, ఎలక్ట్రికల్ ఎఇ రామచంద్రయ్య, వార్డు ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్, వివిధ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీపై నేతల సంబరాలు



సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, జూలై 18 ప్రభాతవార్త :** తెలంగాణలో రైతు రుణమాఫీ అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ చౌరస్తాలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నేతలు కంది ఆగిరెడ్డి, ఎం.డి.తౌఫిక్, తవిడబోయిన గిరి బాబు, రఘుపతిరెడ్డి, బజారు జగన్‌గౌడ్, గరిక సుధాకర్, జలీల్‌పాషా, డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, రఫీకర్, విజయ్, రాజేష్, మహిళా కాంగ్రెస్ నేతలు అమరేశ్వరి, యూత్ కాంగ్రెస్ నేతలు అకారపు అరుణ్ కుమార్, తుమ్మల దేవిరెడ్డి, ఎస్సీ సెల్ నేత లింగంపల్లి రామకృష్ణ తదిరతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిన్న సన్నకారు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రుణామాఫీ చేయడం అభినందనీయమన్నారు. రైతులకు సిఎం రేవంత్‌రెడ్డి తోడ్పాటు అందిస్తున్నారని, ఎన్నికల హామీలు అమలు చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ చౌరస్తాలో స్వీట్లు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆగంరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, మహేష్, పూస సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని బిజెపి వినతి



డిప్యూటి కమిషనర్ అంజనేయులుకు సమస్యలు విన్నవిస్తున్న బిజెపి నేతలు

**ఉప్పల్, జూలై 18 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్‌లో బోనాల ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేయాలని ఉప్పల్ బిజెపి నేతలు గురువారం డిప్యూటి కమిషనర్ అంజనేయులును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు గొరిగె కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, రావుల బాలకృష్ణగౌడ్, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, తీగ విఠల్‌రావు, ఎల్లగోని ప్రకాష్‌గౌడ్ తదితరులు మాట్లాడుతూ ఉప్పల్ డివిజన్‌లోని మాల్ మైసమ్మ ఆలయం, మహంకాళి ఆలయం పరిసర ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై డిప్యూటి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు వర్కల రాజేందర్‌గౌడ్, దువ్వాల రమేష్, సోమేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.